E-KABURU E-PAPER


# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం


(తేదీ) 12-09-2025 (వారం) శుక్రవారం

హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



పోలీస్, ఫైర్‌సర్వీస్ డైరెక్టర్ నియామకం కేసు.. తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

» 3లో



ఇరుగంటిపల్లి చెరువుకు నీరందించే కాలువను కాంక్రీట్ తో పూడ్చిన దృశ్యం



నీళ్లు లేక ఒట్టిపోయిన ఇరుగంటిపల్లి శనగకుంట చెరువు

# ప్రజా ప్రభుత్వంలో...

## కాలువ పూడ్చి... కేసులు పెడతామని బెదిరింపులు

**వేధింపులకు పాల్పడుతున్న డీఈ సంపత్ కుమార్**

**-ఆమాత్య ఆదేశాలు భేఖాతర్**

**- 45 రోజులు గడిచినా చెరువులోకి చుక్క నీరు చేరని వైనం**

**-ఇదే ముమ్మాటికీ నిజం...**

**-మంత్రి గారి పీఏలను పక్కదారి పట్టిస్తున్న అధికారి**

**నకిలి మకిలీ కోసం ఆరాటమా!**

**- సమస్యను విచారించాలంటున్న ఇరుగంటిపల్లి గ్రామస్తులు**

ఈకబురు, తెలంగాణ : రాష్ట్ర మంత్రి.. జిల్లా కలెక్టర్... సూపరింటెండెంట్ ఇంజనీర్ లాంటి వాళ్లకు ఆ గ్రామం సమస్య చాలా చిన్నదిగా కనిపించొచ్చు... కానీ పంటలకు సాగు నీరు అందించే ఆ గ్రామ చెరువు సమస్య అక్కడి వారికి చాలా పెద్దదిగా కనిపిస్తోంది. ఆమాత్యులు, ఉన్నతాధికారులు. స్పష్టమైన ఆదేశాలిస్తే పది రోజుల్లోనే చెరువును నింపవచ్చు. చుక్క నీరు ఇవ్వకుండా రైతులపై బెధిరింపులకు పాల్పడే నిర్వాహకం డీఈ సంపత్ కుమార్ కే చెల్లుతుంది. సమస్యను పరిష్కరించాల్సిన డీఈ రైతులపై కేసులు పెట్టే స్థాయికి దిగజారారు. కేసులు పెడతామని బెధిరింపులకు పాల్పడి చెరువులోకి చుక్క నీరు రాకుండా అడ్డుకట్ట వేస్తున్నాడు. నకిలీ ఎరువులు విక్రయించే ఓ మకిలీకి లబ్ధి చేకూర్చేందుకు కాలువనే పూడ్చి వేసిన వైనం గ్రామ రైతులను నిచ్చేష్టులను చేస్తోంది. ప్రజా ప్రభుత్వంలో ఓ అధికారి వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. చెరువు నింపి నీటి సమస్యను పరిష్కరిచాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.స్పష్టమైన ఆదేశాలిచ్చినా... దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా రైతులనే దోషులుగా నిలబెట్టేందుకు ఇరిగేషన్ ఇంజనీరింగ్ డీఈ సంపత్ తీరు వివాదాస్పదంగా మారుతోంది.

**కాలువను పూడ్చిన డీఈ**

నల్గొండ నియోజకవర్గం కనగల్ మండలంలోని చివరి గ్రామం ఇరుగంటిపల్లి. పుట్టంగండి కాలువ ద్వారా చెరువులు నింపుతున్న ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు కొన్నేళ్లుగా ఇరుగంటిపల్లి శనగకుంటను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. పట్టించుకోకపోవడం ఒక ఎత్తైతే చెరువు వైపు వచ్చే కాలువను సిమెంట్ కాంక్రీట్ తో పూడ్చి నీళ్లు రాకుండా అడ్డుకున్నారు. రైతులు జిల్లా మంత్రికి మొరపెట్టుకుకుంటే మేము పూడ్చలేదని ఇంజనీరింగ్ అధికారులు భూకాయించారు. కాంక్రీట్ ను తొలగిస్తామని చెప్పి మొఖం చాటేశారు. ఇప్పటి వరకు నీరు రాకపోవడంతో పూడ్చిన సిమెంట్ కాంక్రీట్ ను రైతులే

తరువాయి 2లో

# మారిషస్‌కు రూ.6,004 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ

- »భారత ప్రభుత్వం ప్రకటన
- »ఇరుదేశాల ప్రధానులు మోదీ, నవీన్ చంద్ర భేటీ
- »ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ ఏడు ఒప్పందాలపై సంతకాలు

తరువాయి 2లో



ఈకబురు,వారణాసి: మారిషస్‌కు 680 మిలియన్ డాలర్ల( రూ.6,004 కోట్లు) ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గూలామ్ గురువారం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో సమావేశమయ్యారు. భారత్- మారిషస్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా వి ద్య, ఇంధనం, హైడ్రోగ్రఫీ, అంతరిక్ష పరిశోధన వంటి రంగాల్లో సహకారాన్నిపెంపొందించుకోవడమే లక్ష్యంగా రెండు దేశాల మధ్య ఏడు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.

# పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణ సహకారం

- »రైలు–రోడ్డు–పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేసేలా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి
- »ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు వరకు అలైన్‌మెంట్ తయారు చేశాం
- »ట్రిపుల్ ఆర్ చుట్టూరా 362 కిలోమీటర్ల మేర రింగ్‌రైల్ నిర్మాణం చేపట్టాలి
- »రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

తరువాయి 2లో



ఈకబురు, హైదరాబాద్: ప్రయాణికులకు వేగవంతమైన, రైలు-రోడ్డు-పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేసేలా రైల్వే ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులను కోరారు. రాష్ట్రంలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షించారు. వివరాలు సీఎం మాటల్లోనే....

పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది. అవసరమైన నిధులను సమకూర్చటంతోపాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు ఉండాలి. దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలి.

- రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉంది. - రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసింది. దానికి అనుగుణంగా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి. రైల్వే విభాగ పరిశీలనలో ఉన్న అన్‌లైన్‌మెంట్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్‌మెంట్‌ను పరిశీలించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలి. హైవే వెంట రైలుమార్గం ఉండాలి, హైవేకు ఇరువైపులా కిలోమీటరన్నర దూరం వరకు ఇండ్రస్టియల్ కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయి.

## పూజా రాణికి పతకం ఖాయం

» 6లో



## తమ్ముడి భార్య కేసు.. హీరోయిన్ హన్సికకు షాక్..!

» 5లో



## 'తుక్కు' పత్రం తెస్తే అదనపు రాయితీ ఇవ్వండి

» 4లో



# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- »రాష్ట్రానికి చెందిన మావోయిస్టు అగ్రనేత బాలకృష్ణ సహా 10 మంది మృతి
- »గరియాబండ్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు... మృతుల్లో బాలకృష్ణ ఉన్నట్లు ప్రకటించిన పోలీసులు
- »ఆయనపై మొత్తం రూ.2 కోట్ల రివార్డు



ఈకబురు,(ఛత్తీస్‌గఢ్):ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబండ్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎదురుకాల్పుల్లో మొత్తం 10 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు గురువారం పోలీసులు ప్రకటించారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి మోడెం బాలకృష్ణ (60) ఉన్నట్లు ఓ అధికారి చెప్పారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండకు చెందిన బాలకృష్ణ అలియాస్ మనోజ్ అలియాస్ బాలన్న, అలియాస్ రామచందర్, అలియాస్ భాస్కర్‌పై మొత్తం రూ.2 కోట్ల రివార్డు ఉన్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హర్షం వ్యక్తం చేశారు. వచ్చే మార్చి 31లోగా నక్సలైట్ల ఏరివేత పూర్తి కావడం ఖాయమని పేర్కొన్నారు.

మెయిన్‌పూర్ అటవీ ప్రాంతంలో..

మెయిన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. యాంటీ నక్సలైట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు కూంబింగ్ చేపడుతుండగా ఎన్‌కౌంటర్ జరిగినట్లు రాయిపూర్ రేంజ్ ఐజీపీ అమ్రేశ్ మిశ్రా తెలిపారు.

తరువాయి 2లో

# ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్ హత్య

**యూటాలోని ఓ కాలేజీలో మాట్లాడుతుండగా కాల్పులు**

**తుపాకీ హింసపై ప్రశ్నకు జవాబిస్తుండగా ఘటన**

**అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**రాజకీయ హత్యగా అభివర్ణించిన యూటా గవర్నర్**

**చార్లీ కిర్క్ గొప్ప వ్యక్తి: డొనాల్డ్ ట్రంప్**



ఈకబురు, : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్(31) దారుణ హత్యకు గురయ్యారు. బుధవారం యూటా రాష్ట్రంలోని ఓ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతుండగా దుండగుడు ఆయనను కాల్చి చంపాడు. దీంతో కార్యక్రమానికి హాజరైన జనం భయంతో పరుగులు తీశారు. కిర్క్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ప్రాణం పోయినట్టు వైద్యులు తెలిపారు. ఒక అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు యూటా గవర్నర్ స్పెన్సర్ కాక్స్ ప్రకటించారు. రాష్ట్రానికి ఇదో చీకటి రోజని ఆయన పేర్కొన్నారు. దీనిని రాజకీయ హత్యగా అభివర్ణించారు. నిందితుడు నల్లటి దుస్తులు ధరించి, క్యాంప్‌సలోని దూరంగా ఉన్న ఓ భవనం పైకప్పు నుంచి కాల్పులు జరిపాడని అధికారులు తెలిపారు. కాగా, 'టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ' అనే యువజన సంస్థకు కిర్క్ సహవ్యవస్థాపకుడు. ఆ సంఘం సీఈవో కూడా. కిర్క్ హత విషయాన్ని ట్రంప్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అమెరికా యువత హృదయాలను కిర్క్ కంటే బాగా అర్థం చేసుకునేవారు లేరని ట్రూత్ సోషల్‌లో పెట్టిన పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు. ఆయనో గొప్ప వ్యక్తి అని, లెజండరీ కూడా అని కొనియాడారు. అలాగే, కిర్క్ హత్యను రిపబ్లికన్లు, డెమోక్రాట్లు తీవ్రంగా ఖండించారు.

తుపాకీ సంస్కృతిపై మాట్లాడుతుండగానే..

హత్యకు సంబంధించిన వీడియోలను యూటా వ్యాలీ యూనివర్సిటీకి చెందిన కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన తెల్లటి టెంట్‌లో కిర్క్ కూర్చొని మాట్లాడుతుండగా ఘటన జరిగింది.

తరువాయి 2లో



## 243 సీట్లు.. 2,300 దరఖాస్తులు

» 2లో




## నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన కాంగ్రెస్ ప్రభుత్వం

» 3లో

## నేపాల్ కొత్త ప్రధానిగా కుల్మాన్ ఘీసింగ్! అధికారిక ప్రకటన

» 3లో





## ఏరులైన రోడ్లు

- » భాగ్యనగరంలో భారీ వర్షం
- » రంగారెడ్డి జిల్లా యాచారంలో 17.9,మెదక్ జిల్లా కేంద్రంలో 17.8 సెం.మీ.
- » హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్
- » అప్రమత్తంగా ఉండండి: సీఎం

» 2లో

మొదటి పేజీ తరువాయి

## పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణ సహకారం



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసింది. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలి. రైల్వే విభాగ పరిశీలనలో ఉన్న అన్‌లైన్‌మెంట్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్‌మెంట్‌ను పరిశీలించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలి. హైవే వెంట రైలు మార్గం ఉండాలి, హైవేకు ఇరువైపులా కిలోమీటరన్నర దూరం వరకు ఇండ్రస్టియల్ కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయి.

- కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్‌మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలి. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతోపాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలి. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలి.

- వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలి. గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా పనులు చేపట్టాలి. వరంగల్‌లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలి. భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలి. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తోపాటు వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలి'అని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

ఆర్ఆర్ఆర్ చుట్టూరా రీజనల్ రింగ్ రైల్

హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైల్వే అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేస్తే.. హైదరాబాద్ మహానగర భవిష్యత్ స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు.

## 243 సీట్లు.. 2,300 దరఖాస్తులు



### బిహార్‌లో గెలుపు గుర్రాల కోసం కాంగ్రెస్ వేట

ఈకబురు,న్యూఢిల్లీ: బిహార్‌లో సీఎం నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపి అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ పథక రచన చేస్తోంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు 243 స్థానాల్లో గెలుపు గుర్రాల కోసం వేట కొనసాగిస్తోంది. సీట్ల పంపకాల విషయంలో ఇండియా కూటమి ఆమోద ముద్ర వేసేవరకూ ఈ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక కొనసాగనున్నది.

ఆశావహుల నుంచి ఇప్పటికే 2,300పైగా దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ఆధారంగా పార్టీ బలం, బలహీనతలపై ఒక అవగాహనతోపాటు.. కొత్తగా ఎదుగుతున్న నేతలపై ప్రధానంగా దృష్టి సారించడమే రాష్ట్ర కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 16న కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం కానున్నది. 14వ తేదీలోగా అభ్యర్థుల జాబితాను పంపాలని రాష్ట్ర పార్టీ కోరింది. 16న జరిగే సమావేశంలో ఈ పేర్లపై చర్చించి ఆమోదముద్ర వేయనున్నారు.

ఒక్కో సీటుకు ముగ్గురు పోటీ: రాష్ట్ర పార్టీ ఎన్నికల కమిటీ మొత్తం 243అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో సీటు నుంచి ముగ్గురి పేర్లను సిద్ధం చేసి స్క్రీనింగ్ కమిటీకి పంపించనున్నది. ఈ నెల 19న జరగనున్న కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో దరఖాస్తులను పరిశీ లించనున్నారు. అంతిమంగా ఒకరి పేరును ఎంపిక చేసి ఆమోదం కోసం ఢిల్లీలోని అధిష్టానానికి పంపించనున్నారు. ఇదే జాబి తాను యథాతథంగా లేదా కొద్ది మార్పులతో అధిష్ఠానం ప్రటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మొదటి పేజీ తరువాయి

## నేపాల్ కొత్త ప్రధానిగా కుల్మాన్ ఘీసింగ్! అధికారిక ప్రకటన



ఈ-కబురు, : సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై నిషేధంతో ప్రారంభమైన జెన్ జీ ఉద్యమం, ప్రభుత్వంలో పెద్దల నేతలపై అవినీతి ఆరోపణలు నేపాల్ )ను అతలాకుతలం చేశాయి. ముఖ్యంగా ఆ దేశ రాజధాని కార్‌మాండూ అల్లర్లతో అట్టుడికింది. ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో సైన్యం సూచన మేరకు ప్రధాని కేపీ శర్మ ఓలి తో సహా పలువురు మంత్రులు, దేశ అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ సైతం తమ పదవుకుల రాజీనామాలు చేశారు. ప్రధాని రాజీనామా చేసినా.. ఆందోళనకారులు మాత్రం ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. దీంతో కార్‌మాండూలో సైన్యం నిరవధిక కర్ఫ్యూ విధించి రంగంలోకి దిగింది. దేశంలో అల్లర్ల నేపథ్యంలో కార్‌మాండూలోని త్రిభువన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ను మూసివేశారు.

సైన్యం చొరవ తీసుకుని ఆందోళనకారులతో జరిపిన చర్చలు కొలిక్కి వచ్చాయి. ఇక నేపాల్ కొత్త ప్రధానిగా కుల్మాన్ ఘీసింగ్ పేరు దాదాపు ఖరారు అయినట్లుగా తెలుస్తోంది. ఈ విషయంపై కాసేపట్లో ఆర్మీ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. అయితే, కుల్మాన్ ఘీసింగ్ గతంలో నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి ఎండీగా పని చేశారు. దశాబ్దాల పాటు దేశంలో కొనసాగిన విద్యుత్ అంతరాయాలను తొలగించి, విద్యుత్ కొరతను అధిగమించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. కుల్మాన్ ఘీసింగ్ దేశానికి చేసిన సేవలు, కృషితో ప్రజల్లో గొప్ప ఆదరణ పొందారు.

మొదటి పేజీ తరువాయి

## మారిషస్‌కు రూ.6,004 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ



ఈ సందర్భంగా వి ద్య, ఇంధనం, హైడ్రోగ్రఫీ, అంతరిక్ష పరిశోధన వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా రెండు దేశాల మధ్య ఏడు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్, మారిషస్‌లు కేవలం భాగస్వామ్య పక్షాలు మా త్రమే కాదని.. అవి ఒకే కుటుంబమని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు.

స్వేచ్ఛాయుతమైన, సురక్షితమైన, స్థిరమైన, సౌభాగ్యవంతమైన హిందూ మహాసముద్రం ఇరుదేశాలకు ఉమ్మడి ప్రాధాన్యం కలిగిన అంశమని వివరించారు. నవీన్‌చంద్రతో భేటీ అనంతరం మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. మారిషస్ ప్రత్యేక ఆర్థిక మండలి భద్రతను బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందన్నారు. మారిషస్‌లో యూపీఐ చెల్లింపులు, రూపేకార్డులు అందుబాటులోకి వచ్చాయని, ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య వాణిజ్యం స్థానిక కరెన్సీల్లోనే జరి గేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

మారిషస్‌లో 'మిషన్ కర్మయోగి'

ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కింద మారిషస్‌లో 10 ప్రాజెక్టులకు భారత్ సాయం అందించబోతోంది. ఇందులో ఓడరేవు, ఎయిర్‌పోర్టు, రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు ఉన్నాయి. ఇది ఆర్థిక సాయం కాదని.. రెండు దేశాల ఉమ్మడి భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడి అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత్, మారిషస్‌లు రెండు వేర్వేరు దేశాలు అయినప్పటికీ వాటి స్వప్నాలు, భవిష్యత్తు ఒక్కటేనని స్పష్టంచేశారు.

చాగోస్ ఒప్పందం కుదిరినందుకు నవీన్ చంద్రతోపాటు మారిషస్ ప్రజలకు మోదీ అభినందనలు తెలిపారు. మారిషస్ సార్వభౌమత్వానికి ఇదొక చరిత్రాత్మక విజయమని ఉద్ఘాటించారు. మారిషస్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. మారిషస్ సార్వ□ౌమత్వాన్ని పూర్తిస్థాయిలో గుర్తించడానికి తమ మద్దతు కచ్చితంగా ఉంటుందని తెలిపారు. మారిషస్‌లో నూతన డైరెక్టరేట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ చెప్పారు.

మారిషస్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వడానికి త్వరలో 'మిషన్ కర్మయోగి'ప్రారంభిస్తామన్నారు. పరిశోధన, విద్య, నవీన ఆవిష్కరణల్లో భారత్, మారిషస్‌ల భాగస్వామ్యం ఉన్నత శిఖరాలకు చేరడం ఖాయమని స్పష్టంచేశారు. చాగోస్ దీవులను మారిషస్‌కు అప్పగించేందుకు ఈ ఏడాది మే నెలలో యునైటెడ్ కింగ్‌డమ్ అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈ దీవులపై హక్కులను యూకే వదులుకుంది. ఇదిలా ఉండగా, మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర ఈ నెల 16 దాకా భారత్‌లో పర్యటించనున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

మెయిన్‌పూర్ అటవీ ప్రాంతంలో..

మెయిన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. యాంటీ నక్సలైట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు కూంబింగ్ చేపడుతుండగా ఎన్‌కౌంటర్ జరిగినట్లు రాయిపూర్ రేంజ్ ఐజీపీ అమ్రేశ్ మిశ్రా తెలిపారు. ఛత్తీస్‌గఢ్ పోలీస్‌కు చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్, జిల్లా పోలీసు విభాగానికి చెందిన 'ఈ-30', సీఆర్‌పీఎఫ్‌కు చెందిన కోబ్రా దళాలు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాయని ఆయన చెప్పారు. సీనియర్ నేతలతో పాటు మొత్తం 10 మంది నక్సలైట్లు మృతి చెందారని, పూర్తి వివరాలు అందాల్సి ఉందని అన్నారు. బాలకృష్ణ మృతితో ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.

హైదరాబాద్‌లో చదువుతూ ఉద్యమ బాట

మోడెం వెంకటయ్య, మల్లమ్మ దంపతులకు బాలకృష్ణ జన్మించారు. వెంకటయ్యకు పోస్టుమ్యాన్ ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ ఏరియాకు సుమారు 50 ఏళ్ల కిందటే మకాం మార్చారు. బాలకృష్ణకు ముగ్గురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. 1983లో మావోయిస్టు (పీపుల్‌స్‌వార్) పార్టీ పట్ల ఆకర్షితుడైన బాలకృష్ణ.. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యను మధ్యలోనే వదిలేసి పోరుబాట పట్టారు. కొంతకాలం రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) జంట నగరాల బాధ్యతలు నిర్వర్తించిన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లారు. దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ఎదిగారు.




1993లో అరెస్టు.. 1999 వరకు జైల్లో..

పీపుల్‌స్‌వార్ పార్టీ పనిలో భాగంగా అడవినుంచి బయటకు వచ్చిన బాలకృష్ణను అప్పటి యాంటీ నక్సల్స్ స్క్వాడ్ (ఏఎన్ఎస్) పోలీసులు 1993లో అరెస్టు చేశారు. పోలీసు డీఐజీ కేఎస్ వ్యాస్ హత్య, ఎమ్మెల్యే కిడ్నాప్‌లతో పాటు బెంగళూరు ఆయుధాల స్వా□దీనం, కుట్ర కేసులలో ఆయన సుమారు ఆరేళ్ల పాటు ముషీరాబాద్ జైల్లోనే ఉన్నారు.

1999లో బెయిల్‌పై విడుదలైన ఐదు రోజులకే కుటుంబసభ్యులు ఎంత బతిమిలాడినా వినకుండా తిరిగి అడవిబాట పట్టారు. సుమారు 26 సంవత్సరాలు ఏవోబీలో వివిధ కేడర్‌లలో పని చేశారు.ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల పోలీసులకు మోస్ట్‌వాంటెడ్‌గా మారారు. ఆయనపై మూడు రాష్ట్రాలతో పాటు ఎన్ఐఏ ప్రకటించిన దానితో కలిపి రూ.2 కోట్ల రివార్డు ఉన్నట్లు సమాచారం.

ఆపరేషన్ కగార్ పేరిట గత కొంతకాలంగా ప్రత్యేక పోలీసు బలగాలు అడవులను జల్లెడ పడుతున్న సంగతి తెలిసిందే. ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఇతర నాయకులు, దళాలతో కలిసి బాలకృష్ణ ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దులో సంచరిస్తున్నట్లు కేంద్ర బలగాల నుంచి సమాచారం అందింది. ఈ మేరకు కూంబింగ్ చేపట్టగా ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది.

## ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్ హత్య




తుపాకీ సంస్కృతిపై మాట్లాడుతుండగానే..

హత్యకు సంబంధించిన వీడియోలను యూటా వ్యాలీ యూనివర్సిటీకి చెందిన కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన తెల్లటి టెంట్‌లో కిర్క్ కూర్చొని మాట్లాడుతుండగా ఘటన జరిగింది. టెంట్‌లో ఆయన వెనుక 'ది అమెరికన్ కంబ్యాక్', 'ప్రూవ్ మీ రాంగ్' అని రాసిన నినాదాలు కనిపిస్తున్నాయి. తూటా శబ్దం వినపడగానే కిర్క్ మెడలో ఎడమవైపు నుంచి రక్తం బయటికి చిమ్ముతుండగా, కిర్క్ తన కుడి చేతిని పైకి చూపుతూ కనిపించారు. దీంతో కార్యక్రమం లో పాల్గొన్న జనం పరుగులు తీశారు. కిర్క్ స్థాపించిన 'టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ' సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. తుపాకీ హింసపై ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు కిర్క్ సమాధానాలు ఇస్తుండగానే ఆయనపై కాల్పు లు జరగడం గమనార్హం. గతపదేళ్లలో ఎంతమంది ట్రాన్స్‌జెండర్ అమెరికన్లు మాస్ షూటర్లుగా ఉన్నా రో మీకు తెలుసా? అని ఒకరు ప్రశ్నించగా, 'చాలా మంది' అని కిర్క్ జవాబిచ్చారు. గత పదేళ్లలో అమెరికాలో ఎంతమంది మాస్ షూటర్లు ఉన్నారో మీకు తెలుసా? అని ప్రశ్నించగా, 'ముఠా హింసను లెక్కించాలా? వద్దా? అని కిర్క్ అడిగారు. ఇంతలోనే కాల్పుల ఘటన చోటుచేసుకుంది.

భారతీయులకు వ్యతిరేకంగా పోస్టు..

గతంలో భారతీయులకు వ్యతిరేకంగా కిర్క్ పెట్టిన పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. భారత్ నుంచి వచ్చేవారికి మరిన్ని వీసాలు అవసరం లేదని అప్పట్లో ఆయన వ్యాఖ్యానించారు. 'భారత్ నుంచి వచ్చే ప్రజలకు అమెరికా మరిన్ని వీసాలు మంజూరు చేయాల్సిన అవసరం లేదు. చట్టపరమైన వలసల కారణంగా అమెరికన్ వర్కర్ల స్థానంలో భారతీయులు చేరిపోయారు. ఇక చాలు. అమెరికా నిండిపోయింది. మన వాళ్లకు తొలి ప్రాధాన్యం ఇద్దాం' అని ఈనెల 2న 'ఎక్స్'లో కిర్క్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందం కొలిక్కి రావాలంటే భారత్‌కు మరిన్ని వీసాలు మంజూరు చేయాల్సి ఉంటుందని ఫ్యాక్స్ న్యూస్ వ్యాఖ్యాత పెట్టిన పోస్టుకు స్పందనగా కిర్క్ ఈ పోస్టు పెట్టారు.

## ఏరులైన రోడ్లు



ఈకబురు,హైదరాబాద్, మెదక్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు ఒక్కసారిగా కుండపోత వాన కురిసింది. చూస్తుండగానే రోడ్లు ఏరులై పారాయి. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మెదక్, యాదాద్రి జిల్లాల్లో.. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రంలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లా యాచారంలో 17.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మెదక్ జిల్లా కేంద్రంలో 17.8, యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో 17.3, మోటకొండూరులో 16.5, సిద్దిపేట జిల్లా దూల్మెట్టలో 13.6, రంగారెడ్డి జిల్లా తటి అన్నారంలో 12.3, హనుమకొండ జిల్లా ఐనవోలు 11.9 సెం.మీ., రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో 11.4 సెం.మీ., డిఫెన్స్ కాలనీలో 10.3, మొయినాబాద్‌లో 9.3 సెం.మీ. కురిసింది. ముఖ్యంగా తూర్పు హైదరాబాద్‌పై వరుణుడు విరుచుకుపడ్డాడు. గంటన్నర పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి హయత్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాలు జలమయమయ్యాయి. విజయవాడ జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర మోకాలి లోతు నీరు నిలిచింది. వనస్థలిపురం నుంచి పెద్దఅంబర్‌పేట వరకు భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పాఠశాల నుంచి విద్యార్థులు ఇంటికి చేరుకునే సమయం కావడంతో బడి బస్సులు రోడ్ల పైనే నిలిచిపోయాయి. ప్రధాన రహదారి నుంచి కాలనీల్లోకి వరద చేరడంతో లోతట్టు ప్రాంతంలోని ఇళ్లు నీటమునిగాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది.

మెదక్ జిల్లా కేంద్రం జలమయం

మెదక్ జిల్లా కేంద్రంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన వాన రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసింది. మెదక్‌హైదరాబాద్ ప్రధాన రహదారి జలమయమైంది. రాందాస్‌చౌరస్తా, మహాత్మాగాంధీ రోడ్డు, ఆటోనగర్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారిపై మోకాలి లోతు నీళ్లు నిలిచాయి. గాంధీనగర్‌లో పలు ఇళ్లలోకి నీళ్లు చేరాయి.

అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్‌రెడ్డి


భారీ వర్ష సూచన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఆదేశించారు. 'పురాతన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ట్రాఫిక్, పోలీసు సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. వాగులపై ఉన్న కాజ్‌వేలు, కల్వర్టులపై నుంచి వరదలు పొంగే ప్రమాదం ఉన్నందున ప్రజలు వాటిని దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా నీటిపారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి' అని సీఎం సూచించారు.

నేడు, రేపు భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచించింది. శుక్రవారం.. ఆసిఫాబాద్, మంచిర్యాల, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో, శనివారం మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో భారీగా కురవచ్చు. మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.



## పోలీస్, ఫైర్‌సర్వీస్ డ్రైవర్ల నియామకం కేసు.. తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు



**ఈ-కబురు,దిల్లీ: తెలంగాణ పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్‌సర్వీస్ డిపార్ట్‌మెంట్లలో 325 డ్రైవర్ పోస్టుల భర్తీ విషయంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ స్టేట్‌లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు దాఖలుచేసిన కేసులో సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. గురువారం దీనిపై సుమారు గంటకుపైగా వాదనలు విన్న అనంతరం జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పోస్టుల భర్తీ కోసం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 2022 ఏప్రిల్ 5, మే 20వ తేదీల్లో జారీచేసిన నోటిఫికేషన్లలో డ్రైవర్ పోస్టుల కోసం కొన్ని విద్యార్హతలు నిర్ణయించడంతోపాటు, అభ్యర్థికి కనీసం రెండేళ్లు వరుసగా కొనసాగిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్న షరతు విధించింది. దాని ప్రకారం 2023 మార్చి 2, 24 తేదీల్లో నైపుణ్య పరీక్ష, ఏప్రిల్ 2న లిఖిత పరీక్ష నిర్వహించింది. నోటిఫికేషన్ జారీచేసే నాటికి వరుసగా రెండేళ్ల డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిని అనుమతించలేదు. దాంతో ఆ అభ్యర్థులు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. వారి అభ్యర్థిత్వాలను పరిగణనలోకి తీసుకొని నియామక ప్రక్రియలో ముందుకెళ్లాలని 2023 అక్టోబరు 10న హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ రిక్రూట్‌మెంట్ బోర్డు ఈ ఏడాది మార్చి 6న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గురువారం తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది రాధాకృష్ణన్, ప్రతివాదుల తరఫున న్యాయవాది నిఖిల్ గోయల్ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు.**

మొదటి పేజీ తరువాయి

## ప్రజా ప్రభుత్వంలో... కాలువ పూడ్చి... కేసులు పెడతామని బెదిరింపులు

స్వయంగా తొలగిస్తుంటే డీఈ సంపత్ కుమార్ వెంటనే ప్రత్యక్షమయ్యారు. ఇంటలీజెన్స్ రిపోర్ట్ వచ్చిందని, ఫొటోలు, వీడియోలు తీసుకొని మీ అంతు చూస్తానని గర్జించి ఆగమేఘాల మీద నిడమనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మా చెరువులోకి చుక్క నీరు రాలేదు, కావాలంటే ఒక్కసారి క్షేత్రస్థాయి పరిశీలిన చేసి నిర్ణయం తీసుకోండి అని బతిమాలిన వినకుండా వెళ్లిపోయారు. నీళ్లు వచ్చేటప్పుడు వస్తాయని, నేనేం వినదల్చుకోలేదని సెలవిచ్చారు. గంటల వ్యవధిలోనే నిడమనూరు ఎస్‌ఐ నుంచి రైతులకు ఫోన్లు... కాలువను ధ్వంసం చేశారని, కేసు నమోదైందని, ఏదైనా ఉంటే డీఈతో మాట్లాడుకోవాలనే హెచ్చరికలతో ఫోన్ పెట్టేశారు. స్టేషనకు రావాలని ఆదేశాలివ్వడంతో రైతులు తీవ్ర మనోవేధనకు గురవుతున్నారు.. చెరువు నింపాల్సిన ఇరిగేషన్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం, చివరి చెరువుకు నీళ్లు వెళ్లేందుకు కాలువ గండ్లు కట్టాల్సిన ఆఫీసర్లు సంతకాలు పెట్టి పత్తా లేకుండా పోవడం సమస్యను మరింత జటిలంగా మార్చింది.

ఇదే ముమ్మాటికీ నిజం..

పుట్టంగండి నుంచి ఎత్తిపోతల ద్వార నల్గొండకు డి3724 ఆర్3 ఆర్ కాలువ ద్వార నీళ్లు వస్తున్నాయి. డి37 గుడిపల్లి కాలువ నుంచి కొత్తపల్లి, అన్నారం. రాజుపేట, ముషంపల్లి, ధర్మాపురం, ఇరుగంటిపల్లి, కందిమళ్లగూడెం, ఎర్రగూడం చెరువులు నింపాల్సి ఉంది. దాదాపు 45 రోజుల నుంచి కాలువ ద్వారా ఇరుగంటిపల్లి, కందిమళ్లగూడెం, ఎర్రగూడెం మినహాయిస్తే మిగతా గ్రామాల చెరువులు నిండి వృధాగా నీళ్లు అలుగుల ద్వార కృష్ణా నదిలో కలుస్తున్నాయి. ఇరుగంటిపల్లి శనగకుంటకు కాలువ ద్వారా చుక్క నీరు చేరకపోగా వర్షపాతం కూడా తక్కువగా నమోదు కావడంతో చెరువు ఇప్పటికీ ఒట్టిపోతోంది. ఈ విషయం పక్కదారి పట్టిస్తూ డీఈ సంపత్ కుమార్ రైతులపై కక్షకట్టడం ఎంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.. ఇరుగంటిపల్లి శనగకుంటకు 6 కాలువల ద్వారా నీరు వస్తుందనే ప్రచారానికి తెరలేపారు. నకిలీ ఎరువులు విక్రయించే ఓ మకిలీకి లబ్ది చేకూర్చేందుకే నీటిని నాగార్జునసాగర్ నియోజకవర్గం వైపు మళ్లిస్తున్నారని, డీఈ నేల విడిచి సాము చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విచారించాల్సిందే....

ఇంజనీరింగ్ డీఈ సంపత్ తీరు, చెరువు సమస్యపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఇరుగంటిపల్లి గ్రామస్తులు మంత్రి, ఉన్నతాధికారులను కోరుతున్నారు. కాలువలో కాంక్రీట్ వేసిన అధికారి తీరును ప్రజా ప్రభుత్వంలో ఎవరు పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. పూడ్చిన కాంక్రీట్ తొలగింపు కాకుండా కాలువకు ఏమైన భంగం కల్గించారా, శనగకుంటకు ఆరు కాలువల ద్వార నీరు వస్తుందా, ఇప్పటి వరకు ఎంత నీరు చేరిందో బహిరంగ విచారణ చేపట్టాలని, కాలువలో వేసిన కాంక్రీట్ ను తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఇరుగంటిపల్లి చెరువుకు నీరందించే కాలువను కాంక్రీట్ తో పూడ్చిన దృశ్యం



నీళ్లు లేక ఒట్టిపోయిన ఇరుగంటిపల్లి శనగకుంట చెరువు

## ఐటి కారిడార్ లో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం యువకుడు మృతి



మృతిచెందిన ఉదయ్ రెడ్డి(ఫైల్)

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి ఐటి కారిడార్ లో ఆర్థరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం అలియాబాద్ కు చెందిన గొర్లి ఉదయ్ రెడ్డి(22) నగరంలోని ఓ ప్రైవేటు సంస్థలో సూపర్వైజర్ గా పనిచేస్తూ ఐటి కారిడార్ పరిధిలోని గౌలిదొడ్డిలో గల ప్రైవేటు హాస్టల్ లో నివాసం ఉంటున్నాడు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో అలియాబాద్ కు చెందిన తన స్నేహితుడు పంతాడి సత్యసాగర్(25)తో కలిసి ద్విచక్రవాహనం మీద గచ్చిబౌలి నుంచి గౌలిదొడ్డి వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఐటి కారిడార్ విప్రో చౌరస్తా వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్ రెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా సత్యసాగర్ కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇద్దరు యువకులను గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఉదయ్ రెడ్డి మృతిచెందాడు. ఉదయ్ రెడ్డి మృతదేహాన్ని గచ్చిబౌలి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఈకబురు,హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్లుగా కష్టపడి చదువుకుంటున్న నిరుద్యోగుల ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఓ ప్రకటనలో విమర్శించారు. "గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇది నిరుద్యోగుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చింది. గ్రూప్ 1 పోస్టుల కోసం కొందరు భారీగా డబ్బులు డిమాండ్ చేసినట్లుగా విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలి. అక్రమాలకు తావు లేకుండా ఆ పరీక్షను మళ్లీ నిర్వహించాలి. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా నివారణ చర్యలు చేపట్టాలి. కేవలం మాటలతో కాకుండా చేతల్లో యువత ఆశలను నెరవేర్చాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

కేటీఆర్‌కు 'గ్రీన్ లీడర్‌షిప్' అవార్డు

భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అమెరికాకు చెందిన 'గ్రీన్ మెంటార్స్' సంస్థ 'గ్రీన్ లీడర్‌షిప్ 2025' అవార్డును ప్రకటించింది. ఈ నెల 24న న్యూయార్క్‌లో జరగనున్న 9వ ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్‌లో కేటీఆర్‌కు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. తెలంగాణలో సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికి గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.



# నేపాల్ భవితపై అనిశ్చితి



**తాత్కాలిక నేత ఎంపికపై కుదరని ఏకాభిప్రాయం**

**కొనసాగుతున్న కర్ఫ్యూ**

**పారిపోతున్న ఖైదీలపై భద్రతా దళాల కాల్పులు**

ఈకబురు,కార్‌మాండూ: నేపాల్ భవితవ్యంపై అనిశ్చితి కొనసాగుతోంది. తాత్కాలిక ప్రధాని ఎంపికపై గురువారం అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్, జెన్‌జెడ్ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. ప్రజలంతా ప్రశాంతంగా ఉండాలని, సంక్షోభానికి రాజ్యాంగ పరిధిలో పరిష్కారం కనుగొంటామని చర్చల అనంతరం అధ్యక్షుడు ప్రకటించారు. మరోవైపు దేశమంతటా ప్రశాంత వాతావరణం నెలకొంది.




కర్ఫ్యూను కొద్ది గంటలపాటు సడలించారు. ఇక జైళ్ల నుంచి పరారైన ఖైదీల సంఖ్య 15,000కు చేరుకుంది. ఓ జైలువద్ద పరారీకి ప్రయత్నించిన సందర్భంగా ఖైదీలు, భద్రతా సిబ్బంది మధ్య ఘర్షణ జరిగి కాల్పుల్లో ముగ్గురు మరణించారు. సోమవారం ప్రారంభమైన ఘర్షణల కారణంగా ఇప్పటిదాకా మరణించిన వారి సంఖ్య 34కు చేరుకుంది. 1,338 మంది గాయపడ్డారు. రామెచ్చాప్ జిల్లా జైలువద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురు ఖైదీలు మరణించగా.. 13 మంది గాయపడ్డారు. భారత సరిహద్దుల్లో 60 మంది నేపాల్ నుంచి పారిపోయి వచ్చిన ఖైదీలను సశస్త్ర సీమా బల్ భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.

సైనిక కార్యాలయంలో చర్చలు

జెన్‌జడ్‌కు చెందిన ప్రతినిధులు సైనిక ప్రధాన కార్యాలయంలో అధ్యక్షుడితోపాటు పలువురు సైనిక ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. ప్రభుత్వానికి ఎవరు నాయకత్వం వహించాలన్న అంశంపై వారి మధ్య ఏకాభిప్రాయం రాలేదు. రేసులో మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి, కార్‌మాండూ మేయర్ బాలేంద్ర షా, విద్యుత్తు బోర్డు మాజీ సీఈవో కుల్మన్ ఘీషింగ్ ఉన్నారు. కొత్తగా ధరణ్ మేయర్ హర్కా సంపంగ్ పేరు తెరమీదకు వచ్చింది. చర్చలు జరుగుతున్నాయని సైన్యం అధికార ప్రతినిధి ధ్రువీకరించారు. పార్లమెంటును రద్దు చేయాలని, రాజ్యాంగాన్ని సవరించాలని జెన్‌జడ్ ప్రతినిధులు కొందరు గురువారం డిమాండు చేశారు. రాజకీయ పార్టీలు స్వప్రయోజనాల కోసం తమను వాడుకోవద్దని హెచ్చరించారు.

సైనిక భద్రత మధ్య అధ్యక్షుడు

మంగళవారం నాటి అల్లర్ల నుంచి అధ్యక్షుడు పౌడెల్ సైనిక భద్రత మధ్యే ఉన్నారు. సైనిక ప్రధాన కార్యాలయంలోనే ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఆయన బయటి ప్రపంచానికి కనిపించలేదు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'సాధ్యమైనంత త్వరలో సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న విశ్వాసంతో ఉన్నా. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సంయమనంతో ఉండాలి. శాంతికి సహకరించాలి' అని కోరారు.

3 జిల్లాల్లో నిషేధాజ్ఞలు

కార్‌మాండూ, లలిత్‌పూర్, భక్తపూర్‌లలో నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం 6 గంటల నుంచి 10 వరకూ కర్ఫ్యూను సడలించారు. దీంతో సరకుల కోసం జనం పరుగులు తీశారు. మళ్లీ 10 నుంచి సాయంత్రం 5 వరకూ కర్ఫ్యూ అమల్లో ఉంది. 5 నుంచి 7 వరకూ ఉపశమనం కల్పించిన పోలీసు అధికారులు మళ్లీ రాత్రి 7 నుంచి శుక్రవారం ఉదయం 6 వరకూ ఆంక్షలు విధించారు.

## మన విత్తనాలకు ప్రపంచస్థాయి గుర్తింపు

ఈకబురు,హైదరాబాద్ : తెలంగాణ.. దేశానికి విత్తనోత్పత్తి కేంద్రంగా ఎదిగిందని, దేశ అవసరాల్లో 60% విత్తనాలను ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నామని, 20కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో వెయ్యికి పైగా విత్తన కంపెనీలు, ఆధునిక పరిశోధన, శుద్ధి, నిల్వ సదుపాయాలతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారా తెలంగాణ విత్తనాలకు ప్రపంచస్థాయి గుర్తింపు లభించిందన్నారు. గురువారం హైదరాబాద్‌లో భారత ఆహార, వ్యవసాయ వాణిజ్యమండలి(ఇండియన్ ఛాంబర్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్) ఆఫ్రికా విత్తన వాణిజ్య సంస్థ(ఆఫ్రికన్ సీడ్ ట్రేడ్ అసోసియేషన్)లు సంయుక్తంగా నిర్వహించిన భారత్‌ఆఫ్రికా విత్తన సదస్సు2025లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. "భారత్, ఆఫ్రికా దేశాలు వ్యవసాయాభివృద్ధికి సంయుక్తంగా కృషి చేయాలి. రాష్ట్రంలో అమలుచేస్తున్న రైతు సంక్షేమ విధానాలను ఆఫ్రికా దేశాలు అనుసరిస్తే నాణ్యమైన విత్తనాల వినియోగం పెరిగి ఆహార భద్రత గణనీయంగా మెరుగుపడుతుంది" అని పేర్కొన్నారు.



## రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధింపుపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

**బిల్లుల ఆమోదంలో కోర్టుల జోక్యం తగదన్న కేంద్రం**

**ఉదాసీనంగా కూర్చోలేమన్న రాజ్యాంగ ధర్మాసనం**

ఈకబురు,దిల్లీ: శాసనసభ ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలపడంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువును నిర్దేశించిన వివాదంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు పది రోజుల పాటు కొనసాగిన విచారణ గురువారం ముగిసింది. ఈ అంశంపై 14 ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరిన న్యాయాభిప్రాయంపై తీర్పును సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం రిజర్వు చేసింది. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వ్యక్తిగత హోదాలో అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈ వివాదానికి సంబంధించి రాజ్యాంగంలోని వివిధ అంశాలపై తమ వాదనలను వినిపించారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య అధికారాల విభజన గురించి రాజ్యాంగంలో వివరంగా ఉందని తుషార్ మెహతా పేర్కొన్నారు. గవర్నర్ విచక్షణాధికారాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం గానీ నిర్ణీత గడువును విధించడం గానీ చేయలేవని తెలుపగా ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. 'మూడు వ్యవస్థల్లో ఏది అత్యున్నతం అనే విషయమై వాదనలు ఎలా ఉన్నప్పటికీ ...రాజ్యాంగం సంరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదే. వ్యవస్థల మధ్య అధికారాల విభజనను నేను గట్టిగా సమర్థిస్తాను. న్యాయవ్యవస్థ క్రియాశీలతతో ఉండాలి గానీ న్యాయ ఉగ్రవాదం, సాహసోపేత వైఖరి సమర్థనీయం కాదు. అదే సమయంలో ప్రజాస్వామ్యంలోని ఒక వ్యవస్థ తన విధుల నిర్వహణలో విఫలమైతే.. రాజ్యాంగ సంరక్షణ బాధ్యతలున్న న్యాయస్థానానికి జోక్యం చేసుకునే అధికారం ఉండదా? ఏమీ పట్టనట్లు ఉదాసీనంగా ఉండాలా?' అని సీజేఐ జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.

రాజ్యాంగ శూన్యత లేదు: మెహతా

'రాజ్యాంగ సంరక్షణతో పాటు పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత కోర్టుకే కాదు... కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలకూ ఉంటుంది' అని తుషార్ మెహతా బదులిచ్చారు. గవర్నర్ విచక్షణాధికారాలను వినియోగించాల్సిన చోట న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ఆదేశాలివ్వడం అధికార విభజన సూత్రాన్ని ఉల్లంఘించడమేనని తెలిపారు. బిల్లులకు నిర్ణీత వ్యవధిలోనే ఆమోదం తెలపాలంటూ గవర్నర్లకు ఆదేశాలివ్వాల్సినంత రాజ్యాంగ శూన్యత దేశంలో లేదన్నారు. దశాబ్దాలుగా వ్యవస్థలు సామరస్యంగానే కొనసాగుతున్నాయని చెప్పారు. బిల్లుల ఆమోదం విషయంలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల వాదనలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్‌తో పాటు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు. ప్రజాప్రాధాన్యం కలిగిన అంశాలు, న్యాయపరమైన సందేహాలు తదితరాలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరే అధికారం రాజ్యాంగంలోని 143(1) ప్రకారం రాష్ట్రపతికి ఉందని ధర్మాసనం పేర్కొంది. న్యాయస్థానం సూచనలు, సలహాలను పాటించడం, పాటించకపోవడం రాష్ట్రపతి విచక్షణకు లోబడే ఉంటుందని తెలిపింది. అలాగే రాష్ట్రపతి అడిగిన అంశాలపై అభిప్రాయాలు తెలపడం, తెలపకపోవడం సుప్రీంకోర్టు ఇష్టం మేరకే ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

## అక్టోబరులో టాటా క్యాపిటల్ రూ.17,600 కోట్ల ఐపీఓ




దిల్లీ: టాటా క్యాపిటల్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా 2 బిలియన్ డాలర్ల (రూ.17,600 కోట్లకు పైగా) నిధుల్ని సమీకరించేందుకు సిద్ధమవుతోంది. అక్టోబరు ప్రథమ పక్షంలోనే ఈ ఇష్యూ జరగనుంది. సెప్టెంబరు 30లోపు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కావాలని ఈ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థకు గతంలో విధించిన గడువును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పెంచిన నేపథ్యంలో, సాధ్యమైనంత త్వరగానే ఐపీఓకు రావాలని సంస్థ చూస్తోంది. కంపెనీ విలువను 18 బి.డాలర్లు (సుమారు రూ.1.58 లక్షల కోట్లు)గా పరిగణించి, ఐపీఓ ద్వారా 2 బి.డాలర్లను సమీకరించనుంది. ఏప్రిల్‌లో కాన్ఫిడెన్షియల్ పద్ధతిలో ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి అందించినప్పుడు.. కంపెనీ విలువను 11 బి.డాలర్లుగా లెక్కించగా, ఇప్పుడు ఈ విలువ అమాంతం పెరగడం గమనార్హం.రెండో అతిపెద్ద ఇష్యూ: 2024 అక్టోబరులో వచ్చిన హ్యుందాయ్ మోటార్ ఇండియా 3.3 బి.డాలర్ల (సుమారు రూ.27,870 కోట్ల) ఐపీఓ తర్వాత టాటా క్యాపిటల్ ఐపీఓనే అతి పెద్దది. టాటా క్యాపిటల్ ప్రమోటర్ టాటా సన్స్ 23 కోట్ల షేర్లను, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్)లో విక్రయించనున్నాయి. మరో 23 కోట్ల ఈక్విటీ షేర్లను కంపెనీ తాజాగా జారీ చేయనుంది. ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో టాటా సన్స్‌కు 88.6%, ఐఎఫ్‌సీకి 1.8% వాటాలున్నాయి.

# రిలయన్స్ భారీ ఫుడ్ పార్క్

### రూ. 1,500 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ ఆహారోత్పత్తులు, పానీయాల తయారీకి ఏకీకృత ప్లాంటును ఏర్పాటు చేయనుంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్(కాటోల్)లో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌పై రూ. 1,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఈ యూనిట్ ఏర్పాటుకు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎఫ్‌ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జూమర్.. మహారాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ యూనిట్‌తో 500మందికిపైగా ఉపాధి కల్పించనుంది. 2026లో తయారీ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభంకానున్నాయి. గత నెలలో నిర్వహించిన వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీ సమీకృత ఫుడ్ పార్క్‌ల ఏర్పాటుకు రూ. 40,000 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించిన విషయం విదితమే. ఏఐ ఆధారిత ఆటోమేషన్, రోబోటిక్స్, ఆధునిక టెక్నాలజీలతో ఆసియాలోనే అతిపెద్ద ఫుడ్ పార్క్‌కు తెరతీయనున్నట్లు వివరించారు. రిలయన్స్ రిటైల్ నుంచి ఆవిర్భవించిన రిలయన్స్ కన్జూమర్ మూడేళ్లలోనే రూ. 11,000 కోట్ల టర్నోవర్‌ను సాధించినట్లు ఏజీఎంలో తెలిపారు.




## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



గురువారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 123.58 పాయింట్లు లేదా 0.15 శాతం లాభంతో 81,548.73 వద్ద, నిఫ్టీ 32.40 పాయింట్లు లేదా 0.13 శాతం లాభంతో 25,005.50 వద్ద నిలిచాయి. స్వెలెక్ట్ ఎనర్జీ సిస్టమ్స్ లిమిటెడ్, సిగాచి ఇండస్ట్రీస్, గ్రీన్‌ప్యానెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, పిక్కాడిలీ ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్, మోహిత్ ఇండస్ట్రీస్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. గుడ్ లక్ ఇండియా, ఆఫర్డబుల్ రోబోటిక్ & ఆటోమేషన్, రోబస్ట్ హోటల్స్ లిమిటెడ్, ప్రుడెన్షియల్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్, డైనమిక్ ప్రొడక్ట్స్

## 'తుక్కు' పత్రం తెస్తే అదనపు రాయితీ ఇవ్వండి



**'ప్రభుత్వం, వాహన పరిశ్రమ కలిసి పనిచేస్తేనే తయారీ వ్యవస్థలో నిజమైన స్వావలంబన సాధించగలం. స్వచ్ఛ, స్మార్ట్ రవాణాలో ప్రపంచాన్ని నడిపించే దిశగా భారత్ పయనిస్తోంది. పెట్టుబడులు, భాగస్వామ్యాలకు భారీ అవకాశాలున్నాయి.**

**సియామ్ వార్షిక సదస్సుకు పంపిన సందేశంలో ప్రధాని మోదీ**

దిల్లీ: కొత్త వాహనం కొనుగోలు చేసే సమయంలో వినియోగదార్లు పాత వాహనాన్ని తుక్కు చేసినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే, అదనపు రాయితీ ఇవ్వాలని వాహన పరిశ్రమకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. పాత వాహనాన్ని తుక్కుకు ఇచ్చి కొత్త వాహనాన్ని కొనుగోలు చేసేవారికి జీఎస్‌టీ రూపంలోనూ ఊరట కల్పించమని ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు ఆయన విజ్ఞప్తి చేశారు. 'స్క్రాప్ పాలసీ (తుక్కు విధానం)' వల్ల అటు పరిశ్రమకు, ఇటు ప్రభుత్వానికి మంచిదేనన్నారు. తుక్కులో లభించే లోహాల (ఉక్కు, సీసం, అల్యూమినియం, ప్లాటినం, పలాడియం) వల్ల, కొత్తగా దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ప్రైవేటు రంగానికి ఉండదని సియామ్ వార్షిక సదస్సులో మంత్రి పేర్కొన్నారు. 'తుక్కు ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి, కొత్త వాహనంపై మీరు రాయితీ ఇస్తే మీ టర్నోవరు పెరుగుతుంది. ప్రభుత్వానికీ జీఎస్‌టీ లభిస్తుంది. దేశంలో కాలుష్యమూ తగ్గుతుంది. కాబట్టి అదనపు రాయితీ ఇవ్వడంపై దృష్టి సారించాల'ని మంత్రి బలంగా చెప్పారు.

**ఈ20 ఇంధనంతో మేలే**

పెట్రోలులో ఇథనాల్ 20% (ఈ20) కలపడంపై కొందరు విశ్లేషకులు, వినియోగదార్లు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు నిజం కావని గడ్కరీ అన్నారు. పెట్రోలులో ఇథనాల్ కలపడం వల్ల చమురు దిగుమతి కాలుష్యం తగ్గుతుందని ఆయన అన్నారు. 'రైతులు రూ.45,000 కోట్ల మేర ప్రయోజనం పొందుతార'ని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో దీనిపై వ్యతిరేకంగా సాగుతున్న ప్రచారం.. తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు చేస్తున్న 'పెయిడ్ క్యాంపేన్' అని విమర్శించారు. గడ్కరీ ఇద్దరు కుమారులకూ ఇథనాల్ కంపెనీలున్నాయని, ప్రభుత్వ విధానం వల్ల వారికే ప్రయోజనమని కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఆరోపించిన సంగతి తెలిసిందే.

**ఇ20కి అనుగుణంగా తయారీ**

2025 ఏప్రిల్ 1 నుంచి ఉత్పత్తి చేసిన అన్ని వాహనాలూ ఇ20 ఇంధనానికి అనుగుణంగానే తయారు చేసినట్లు మహీంద్రా అండ్ మహీంద్రా పేర్కొంది. ఇంధన సామర్థ్యం, యాక్సిలరేషన్ విషయంలో చాలా తక్కువ వ్యత్యాసమే ఉంటుందని తెలిపింది. డ్రైవరు నడిపే తీరును బట్టి కూడా అవి ఉంటాయని వివరించింది. వాహన వారెంటీ విషయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేసింది.

# ఇన్ఫీ18,000 వేల కోట్ల రికార్డ్ బైబ్యాక్




### షేరుకు రూ. 1,800 ధర ఖరారు బోర్డు సమావేశంలో ఆమోదం

న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ బోర్డు సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కి అంగీకరించింది. గురువారం (11న) సమావేశమైన బోర్డు షేరుకి రూ. 1,800 ధర మించకుండా 2.41 శాతం వాటా బైబ్యాక్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 18,000 కోట్లు వెచ్చించనుంది. వెరసి రూ. 5 ముఖ విలువగల 10 కోట్ల ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేయనుంది. గురువారం బీఎస్‌ఈలో ముగింపు ధర రూ. 1,510తో పోలిస్తే బైబ్యాక్‌కు 19 శాతం ప్రీమియంను నిర్ణయించింది.
కంపెనీ 2025 జూన్ త్రైమాసికంలో 88.4 కోట్ల డాలర్ల (రూ. 7,805 కోట్లు) ఫ్రీ క్యాష్ ఫ్లోను ప్రకటించింది. కాగా.. కంపెనీ తొలిసారి 2017లో ఈక్విటీ షేర్ల బైబ్యాక్‌ను చేపట్టింది. ఈక్విటీలో 4.92 శాతం వాటాకు సమానమైన 11.3 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. ఇందుకు ఒక్కో షేరుకి రూ. 1,150 ధరలో రూ. 13,000 కోట్లు వెచ్చించింది. ఆపై రెండోసారి 2019లో రూ. 8,260 కోట్లు, మూడోసారి 2021లో 9,200 కోట్లు చొప్పున షేర్ల బైబ్యాక్‌కు వినియోగించింది. ఈ బాటలో 2022లోనూ రూ. 9,300 కోట్లతో ఓపెన్ మార్కెట్ ద్వారా రూ. 1,850 ధర మించకుండా బైబ్యాక్ చేపట్టింది.

## హైదరాబాద్‌లో 'ఎంజీ సెలెక్ట్' ఎక్స్‌పీరియన్స్ సెంటర్



**హైదరాబాద్: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా, హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో 'ఎంజీ సెలెక్ట్' పేరుతో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. దీనితో కలిపి దేశవ్యాప్తంగా ఇటువంటి కేంద్రాల సంఖ్య 13కు చేరింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంజీ సెలెక్ట్ తాత్కాలిక అధిపతి మిలింద్ షా మాట్లాడుతూ ఎంజీ సైబర్‌స్టర్, ఎంజీ ఎం9 కార్లకు అద్భుత స్పందన వస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. వినియోగదార్ల జీవనశైలి, ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇస్తూ ఇక్కడి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను తీర్చిదిద్దినట్లు ఎంజీ సెలెక్ట్ జయలక్ష్మి మోటార్స్ ఇండియా డీలర్ ప్రిన్సిపల్ పి.గౌతమ్ సాయి అన్నారు. ఎంజీ సైబర్‌స్టర్ ఎక్స్-షోరూమ్ ధర రూ.74.99 లక్షలు కాగా, రూ.72.49 లక్షల పరిచయ ధరతో ప్రీ-బుకింగ్‌లు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రెసిడెన్షియల్ లిమోసిన్ ఎంజీ ఎం9 ఎక్స్-షోరూమ్ ధర రూ.69.90 లక్షలని వివరించారు.**

# దేశంలో అతిపెద్ద డీల్!.. రూ.3472 కోట్లు వెచ్చించిన ఆర్‌బీఐ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముంబై మెట్రో కార్పొరేషన్‌కు చెందిన నారిమన్ పాయింట్‌లోని టోనీ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4.16 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. దీనికోసం ఆర్‌బీఐ ఏకంగా రూ. 3472 కోట్లు వెచ్చించినట్లు తెలుస్తోంది. ఇంతకీ ఈ భూమిని ఎందుకు కొనుగోలు చేసిందనే విషయాన్ని ఇక్కడ తెలుసుకుందాం.

ముంబైలోని నారిమన్ పాయింట్ అనేది దేశంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతం. దీనిని ప్రీమియం వ్యాపార కేంద్రంగా పరిగణిస్తారు. ఇలాంటి ప్రదేశంలో ఆర్‌బీఐ భూమిని కొనుగోలు చేసింది. ఈ ఏడాది జరిగిన అతిపెద్ద డీల్స్‌లో ఇది ఒకటి కావడంతో.. ముంబై రియల్ ఎస్టేట్ మార్కెట్లో చర్చనీయాంశంగా మారింది. అంతే కాకుండా ఈ ఏడాది జరిగిన అతి పెద్ద భూమి కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాల్లో ఇది కూడా ఒకటి కావడం గమనించదగ్గ విషయం.

రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ అయిన సీఆర్ఈ మ్యాట్రిక్స్ నుంచి సేకరించిన ఆస్తి లావాదేవీ డేటా ప్రకారం.. ఆర్‌బీఐ కొనుగోలు చేసిన భూమి కోసం రూ. 208 కోట్లు స్టాంప్ డ్యూటీ చెల్లించింది. ఈ ఒప్పందం సెప్టెంబర్ 5న రిజిస్టర్ అయింది. రిజర్వ్ బ్యాంక్ తన హెడ్‌క్వార్టర్స్‌ను విస్తరించాలనే ప్రణాళికలో భాగంగానే ఈ భూమిని కొనుగోలు చేసింది.



## క్రెడిట్ కార్డు ఉచితం కాదు

పండగలు సమీపిస్తున్నాయి. ఈ సమయంలో కొనుగోళ్లను పోత్సహించేందుకు పలు రాయితీలు అందుబాటులోకి వస్తుంటాయి. ఇదే సమయంలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) తగ్గింపు అందుబాటులోకి వస్తుండటంతో చాలా సంస్థలు ఈసారి పండగల కొనుగోళ్లకు వెలుగులు వస్తాయని భావిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు క్రెడిట్ కార్డు సంస్థలూ ప్రయత్నిస్తున్నాయి. కొత్తగా కార్డులు జారీ చేసేందుకు పోటీ పడుతున్నాయి. పూర్తిగా ఉచితం అంటూ, ఆకర్షిస్తున్నాయి. మరి, ఈ మాటల్లో నిజమెంత? అని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దీనికోసం కొన్ని అంశాలను పరిశీలించాలి.సాధారణంగా క్రెడిట్ కార్డులను జారీ చేసే సమయంలో బ్యాంకులు కొన్ని రుసుములను వసూలు చేస్తుంటాయి. స్టేట్‌మెంట్ ఫీజు, కార్డు పోతే కొత్త కార్డు ఇచ్చేందుకు ఫీజులాంటివి ఇందులో ఉంటాయి. వీటన్నింటి గురించి ఎక్కడా చెప్పరు. కానీ, కార్డు బిల్లులో వీటిని గమనించవచ్చు.
క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో చెల్లించినప్పుడు, ఎలాంటి వడ్డీ ఉండదు. సాధారణంగా ఉచిత వడ్డీ కాలం 50 రోజుల వరకూ ఉంటుంది. ఇది పూర్తిగా మీ కార్డు బిల్లింగ్ తేదీపై ఆధారపడి ఉంటుంది. బిల్లు మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలి. ఆలస్యం చేస్తే రుసుముతోపాటు, వడ్డీ విధిస్తుంది.
ప్రతి క్రెడిట్ కార్డుకూ గరిష్ఠ వినియోగ పరిమితి ఉంటుంది. ఒక బిల్లింగ్ సైకిల్‌లో ఆ మేరకే దాన్ని వినియోగించేందుకు వీలవుతుంది. కార్డుదారుడి క్రెడిట్ స్కోరు, చెల్లింపుల చరిత్ర, ఆదాయం, వినియోగ నిష్పత్తిలాంటివి పరిగణనలోకి తీసుకొని, పరిమితి నిర్ణయిస్తారు. తొలిసారి కార్డు తీసుకున్న వారికి ఇది కాస్త తక్కువగా ఉండొచ్చు. క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తూ ఉంటే, కొంత కాలం తర్వాత పరిమితిని పెంచే అవకాశం ఉంటుంది.చాలామంది మొత్తం బిల్లు చెల్లించకుండా.. కనీస బిల్లు మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటారు. ఇది సాధారణంగా బిల్లులో 5 శాతం వరకూ ఉంటుంది. ఈ కనీస మొత్తాన్ని చెల్లించడం వల్ల క్రెడిట్ కార్డు అమల్లో ఉంటుంది. కానీ, మిగతా మొత్తానికి వడ్డీ తప్పదు. కాబట్టి, గడువులోపు మొత్తం బిల్లును చెల్లించడమే ఎప్పుడూ మేలు. ఒకవేళ పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినప్పుడు దాన్ని ఈఎంఐగా మార్చుకోవడం మంచిది.
క్రెడిట్ కార్డు బిల్లు వచ్చినప్పుడు దాన్ని జాగ్రత్తగా గమనించాలి. ఏం కొన్నారు? కొన్న బిల్లులూ.. స్టేట్‌మెంట్‌లో వచ్చిన మొత్తం సరిగానే ఉందా? వడ్డీ, రుసుముల్లాంటివి ఏమైనా ఉన్నాయా? సరి చూసుకోవాలి. లావాదేవీల్లో ఏదైనా వ్యత్యాసం ఉంటే, కార్డు సంస్థ దృష్టికి తీసుకెళ్లాలి.
కార్డు బిల్లింగ్ తేదీలను జాగ్రత్తగా గమనించాలి. మీ కార్డు బిల్లు ఒక నెలలో రెండో తేదీన బిల్లింగ్ ముగిస్తే.. మూడో తేదీ నుంచి కొత్త బిల్లింగ్ ప్రారంభమవుతుంది. బిల్లింగ్ ప్రారంభంలో కొన్నప్పుడు మాత్రమే 50 రోజుల వ్యవధి లభిస్తుంది. రోజులు గడుస్తున్న కొద్దీ ఈ వ్యవధి తగ్గుతుంది.
రివార్డులు, నగదు వెనక్కి తదితరాలను పరిశీలించాలి. రివార్డు పాయింట్ల ద్వారా కొన్ని వస్తువుల కొనుగోలుపై రాయితీ లభిస్తుంది. ప్రయాణాల్లో, హోటల్ బుకింగ్‌లోనూ డిస్కౌంట్లు లభిస్తాయి. నగదు వెనక్కి ఆఫర్లు ఉన్నప్పుడు.. వెంటనే ఆ ప్రయోజనం లభిస్తుంది. కార్డుతో కొనేటప్పుడు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.
క్రెడిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంలలో నగదు తీసుకోవచ్చు. కానీ, దీనికి నెలకు 34 శాతం వరకూ వడ్డీ ఉంటుందని మర్చిపోవద్దు.
జాగ్రత్తగా వాడితేనే క్రెడిట్ కార్డు మంచిది. నిర్లక్ష్యంగా ఉన్నామా.. అప్పుల ఊబిలోకి నెట్టేస్తుంది. వీలైనంత వరకూ అప్రమత్తంగా ఉండి, అన్ని వివరాలూ తెలుసుకున్నాకే, కార్డుతో కొనుగోళ్లు చేయండి. అప్పుడే మీకు ఇబ్బందులు లేకుండా పండగ షాపింగ్ పూర్తవుతుంది.



## తమ్ముడి భార్య కేసు.. హీరోయిన్ హన్సికకు షాక్..!





హీరోయిన్ హన్సిక సినిమాల కంటే వ్యక్తిగత వివాదాలతోనే వార్తల్లో నిలుస్తోంది. ఇటీవలే ఆమె తన భర్తతో విడిపోతోందంటూ రూమర్స్ గట్టిగానే వినిపించాయి. తన ఇన్‌స్టా అకౌంట్ నుంచి హన్సిక పెళ్లి ఫోటోలు, వీడియోలు డిలీట్ చేయడంతో రూమర్స్ మొదలయ్యాయి. అంతేకాకుండా సోహెల్‌కు రెండో పెళ్లి కావడంతోనే వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయని మరో టాక్ వినిపించింది. అయితే ఇవన్నీ చూస్తుంటే తనకు నవ్వొస్తుందని హన్సిక కొట్టిపారేసింది.

ఈ సంగతి అటుంచితే గతంలో హన్సికతో ఆమె తల్లి జ్యోతిలపై సోదరుడి భార్య ముస్కాన్ గృహహింస కేసు పెట్టారు. తనను వేధింపులకు గురి చేశారని బుల్లితెర నటి ముస్కాన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఈ కేసులో ఇప్పటికే హన్సిక, ఆమె తల్లికి ముంబయి సెషన్స్ కోర్ట్ బెయిల్ మంజూరు చేసింది. కానీ ఈ కేసును క్వాష్ చేయాలంటూ హన్సిక బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

తాజాగా హన్సిక పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఆమె విజ్ఞప్తిని తిరస్కరించింది. హన్సిక దాఖలు చేసిన పిటిషన్ బాంబే హైకోర్టు కొట్టిపారేసింది. దీంతో ఈ కేసులో నిరాశే ఎదురైంది. కాగా.. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వానీ.. టీవీ నటి ముస్కాన్ జేమ్స్‌ను 2020లో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో 2022లో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో హన్సికతో పాటు సోదరుడు ప్రశాంత్, తల్లి జ్యోతిలపై ముస్కాన్ ఫిర్యాదు చేసింది.

# అలాంటి పునాదులే ఇన్నేళ్లు నిలబెట్టాయి!

నటనలో సహజత్వం... అందంలో అచ్చ తెలుగుదనం. సహజ నటి జయసుధని తెలుగు ప్రేక్షకుల హృదయాలకు చేరువ చేసిన విషయాలివే. ఒకవైపు అగ్ర కథా నాయకుల సరసన నటిస్తూనే... మరోవైపు నటనకి ప్రాధాన్యమున్న పాత్రల్లో ఒదిగిపోయారు. 'లక్ష్మణరేఖ', 'జ్యోతి', 'ఆమె కథ', 'ఎదురీత', 'శివరంజని', 'ఇది కథ కాదు', 'పక్కింటి అమ్మాయి'... ఇలా ఆమె చేసిన మరపురాని చిత్రాలెన్నెన్నో. 300కిపైగా సినిమాలతో దక్షిణాది భాషలపై ఓ నటిగా తిరుగులేని ప్రభావం చూపించారు. సహాయ పాత్రలపైనా తనదైన ముద్ర వేస్తున్నారు. కథానాయికగా ఆమె పరిచయమైన చిత్రం 'లక్ష్మణరేఖ' ప్రేక్షకుల ముందుకొచ్చి నేటితో యాభయ్యేళ్లు. ఈ సందర్భంగా జయసుధతో 'ఈనాడు సినిమా' ప్రత్యేకంగా ముచ్చటించింది.

**యాభయ్యేళ్ల ఈ ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే?**

ఒక మహిళ ఇన్నేళ్లు చిత్ర పరిశ్రమలో కొనసాగడం సాధారణమైన విషయం కాదు. కథానాయికగా ఎంత ప్రభావం చూపించానో, సహాయ పాత్రలకి మారాక అంతే శక్తిమంతమైన పాత్రల్ని చేశా. 'అమ్మా నాన్న ఓ తమిళమ్మాయి', 'బొమ్మరిల్లు', 'శతమానం భవతి', 'ఎవడు' ఇలా ఎన్నో సినిమాల్లో గుర్తుండిపోయే పాత్రల్ని చేశా. ఈ ప్రయాణానికి కారణం నా ప్రతిభ మాత్రమే కాదు, దేవుడి ఆశీస్సులు కూడా తోడయ్యాయని నమ్ముతుంటా. నేను కథానాయికగా పరిచయమైన చిత్రం 'లక్ష్మణరేఖ' అయితే, అంతకుముందే బాలనటిగా కొన్ని సినిమాలు చేశా.

**'లక్ష్మణరేఖ' నాయికా ప్రధానంగా సాగే కథ. అలాంటి బలమైన పాత్రకి మిమ్మల్ని ఎంపిక చేయడంపై చర్చ జరిగిందంట కదా. అప్పుడు మీ మనసులో ఎలాంటి ఆలోచనలు ఉండేవి?**

నిజంగా అది చాలా కష్టమైన పాత్ర. తొలి సినిమా చేస్తున్న ఓ కథానాయిక అలాంటి పాత్రని స్వీకరించడం ఓ పెద్ద సవాలే. కానీ నాకు అప్పటికే కె.బాలచందర్ సినిమాల్లో నటించిన అనుభవం ఉంది. ఆ ధైర్యంతోనే 'లక్ష్మణరేఖ' చేయడానికి ఒప్పుకున్నా. ఆ విషయం చాలా మందికి తెలియదు. దానికితోడు అప్పట్లో కొత్తవాళ్లతో సినిమాలు చేయడానికి చాలా మందికి ధైర్యం సరిపోయేది కాదు. అందుకే నిర్మాతల్నీ, దర్శకుడు గోపాలకృష్ణనూ భయపెట్టారు. కానీ దర్శకుడు మాత్రం నన్ను బలంగా నమ్మారు. సీనియర్ నటులు గుమ్మడి నన్ను సెట్‌లో చూసి 'మరీ చిన్నమ్మాయి కదా, ఇంత బలమైన పాత్రని చేస్తుందా?' అని అడిగారు. కానీ ఆ సినిమా తర్వాత ఆయనే నా 'జ్యోతి' సినిమాలోనూ నటించారు. ఆరంభంలోనే అలాంటి బలమైన పాత్రలు వేసిన పునాదుల కారణంగానే ఇన్నేళ్లు నటిగా నిలబడగలిగానేమో.

**ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు మీకు ఎదురైన సవాళ్లు ఎలాంటివి?**

నాకు తెలుగు చదవడం రాదు. ఇప్పటికీ నా పేరు కూడా తెలుగులో రాసుకోలేను. మొదట్నుంచీ నా సంభాషణల్ని దర్శకుడు చదివితే, అర్థం చేసుకుని కెమెరా ముందు చెప్పడం అలవాటు. ఎంత పెద్ద సంభాషణ అయినా సరే, రెండు మూడుసార్లు వింటే చాలు తిరిగి చెప్పేయడం నాకు దేవుడు ఇచ్చిన ఓ గొప్ప వరం. అది నాకు ఎంత మైనస్సో అంత ప్లస్ కూడా అయ్యింది. కొన్నిసార్లు ఆ సంభాషణల్ని నాదైన శైలిలో అర్థం చేసుకుని మనం ఇంట్లో ఎలా మాట్లాడుకుంటామో అలా చెప్పేదాన్ని. అది ఎంతో సహజంగా ఉండేది. ఏమాత్రం నటన అనిపించేది కాదు. అదే నన్ను సహజనటిగా మార్చేసింది. 'లక్ష్మణరేఖ'లో నా వయసుకు మించిన పాత్ర కావడంతో ఎంతో పరిణతితో నటించాల్సి వచ్చింది. 'జ్యోతి'లో అయితే సిరిమల్లె పువ్వల్లె నవ్వు... పాటలో నవ్వు కోసం దర్శకుడు కె.రాఘవేంద్రరావు ఎంత కష్టపడ్డారో మాటల్లో చెప్పలేను. ఊరికే అంత నవ్వు ఎలా వస్తుంది? అందుకే కెమెరా వెనకాల చిన్న పిల్లల్లా కోతి పనులన్నీ చేయిస్తూ నాతో నవ్వించేవారు.

**ఈ ప్రయాణంలో సినీ నిర్మాణం చేపట్టారు, మరి దర్శకత్వం చేయాలని ఎప్పుడూ అనిపించలేదా?**

రామ్‌గోపాల్ వర్మ నిర్మాతగా, నా దర్శకత్వంలో ఓ సినిమా రావల్సింది. కానీ చివరి నిమిషంలో ఆ సినిమా ఆగిపోయింది. ముప్పయ్యేళ్ల కిందట మోహన్‌బాబు, విజయశాంతి ప్రధాన పాత్రధారులుగా ఓ సినిమా చేయాలనుకున్నా. పరుచూరి బ్రదర్స్ రచయితలుగా ఆ సినిమా కూడా దాదాపుగా ఆరంభ దశలో ఆగిపోయింది. వాటి వెనకాల రకరకాల కారణాలున్నాయి. నిర్మాతగా ఏడు సినిమాలు చేశా. ప్రస్తుతానికి నటనపైనే దృష్టి.

**కెరీర్ పరంగా తొలినాళ్లల్లో మీరు అనుకున్న లక్ష్యాల్ని చేరుకున్నారా? ఇంకా నెరవేరని కలలేమైనా ఉన్నాయా?**

పదిహేనేళ్ల వయసులో కథానాయికగా నా ప్రయాణం మొదలైంది. రేపటి గురించి ఆలోచన అన్నదే లేని రోజులవి. ఇక కెరీర్ గురించి నాకు కలలేం ఉంటాయి? అప్పటికీ, ఇప్పటికీ చీరలంటే నాకు పిచ్చి. నా కెరీర్ ఆరంభమైన కొత్తలో వాణిశ్రీ చీరకట్టుకు అందరూ పడిపోయేవారు. మోడ్రన్ డ్రెస్సులే అవసరం లేదు, మన చీరలతోనూ ఇంత అందంగా కనిపిస్తారని వాణిశ్రీ నిరూపించారు. అదే సమయంలోనే హిందీలో జయాబాధురి అంతే సహజంగా కనిపించేవారు. గుడ్డీ, మిలీ చిత్రాల్ని చూసి 'ఇలాంటి డ్రెస్‌లే వేసుకోవాలి, ఇలాంటి వేషమే వేయాలి' అనుకునేదాన్ని. 'మిలీ' సినిమా కొంచెం 'జ్యోతి' తరహాలోనే ఉంటుంది. అలా నాకు కెరీర్ ఆరంభంలో వాణిశ్రీ, జయాబాధురితోపాటు... పాశ్చాత్య దుస్తుల్లో ఇంకా ప్రభావం చూపించిన నీతూసింగ్, జీనత్ అమన్, షబానా అజ్మీ, స్మితా పాటిల్, రేఖ తదితర కథానాయికలు స్ఫూర్తి.

**అప్పట్లో నాయికల మధ్య పోటీ ఎలా ఉండేది?**

పోటీ అప్పుడూ ఇప్పుడూ ఒక్కటే. అయితే అవకాశాలు, పోటీ గురించి ఆలోచించే అవసరం నాకెప్పుడూ రాలేదు. 'లక్ష్మణరేఖ' విడుదల తర్వాత మూడు నాలుగేళ్లకు వెనక్కి వెళ్లిపోదామనుకున్నా. ఎక్కడైనా స్వేచ్ఛ ఉంటేనే నేను పనిచేయగలుగుతా. ఆ వాతావరణం కరువైందేమో అనిపించేది. ఆ వెంటనే మళ్లీ ఏవో అవకాశాలు రావడం, బిజీ కావడం అలా సాగిపోయేది. వేరే కథానాయికకి అవకాశం వచ్చింది, నాకు రాలేదే అని ఎప్పుడూ ఆలోచించలేదు. అయితే చేస్తున్న సినిమాలో 'అందరికంటే నేను బాగా చేయాలి, పేరు తెచ్చుకోవాలి' అనే పట్టుదలైతే ఉండేది. ఎక్కువగా 'డీ గ్లామరైజ్డ్ పాత్రలే చేస్తున్నావు, గ్లామర్ పాత్రలు చేస్తే ఇంటికి వెళ్లిపోవల్సి ఉంటుంది' అని భయపెట్టేవారు. నేను ఆ మాటల్ని ఎప్పుడూ లెక్క చేయలేదు. పెద్దవాళ్లని గౌరవించాలి, క్రమశిక్షణగా ఉండాలని మా నాన్న ఎప్పుడూ చెప్పేవారు. ఆ మాటల్ని మాత్రం నేనెప్పుడూ మరిచిపోలేదు. ఇంత సుదీర్ఘమైన ప్రయాణానికి మరో కారణం అదే అని నమ్ముతా.

**కథానాయిక నుంచి సహాయ పాత్రలకి మారిన దశ, ఆ ప్రయాణ క్రమం గురించి ఏం చెబుతారు?**

వయసు ప్రకారమే అదంతా. 'ఆంటీ' సినిమా చేసేటప్పటికీ నా వయసు 40 అనుకుంటా. 45, 50 ఇలా వయసుకు తగ్గట్టుగా తల్లి పాత్రలు చేస్తూ వచ్చా. అయితే తల్లి పాత్రలపై నా ఎంతో ప్రభావం చూపించగలిగా. 'ఎవడు', 'వారసుడు' తదితర సినిమాల్ని డబ్బింగ్‌లో చూసిన హిందీ ప్రేక్షకులు అక్కడికి వెళ్లినప్పుడు 'దక్షిణాది అమ్మ కదా మీరు...' అంటూ పలకరిస్తుంటారు. అయితే అమ్మ, అత్త పాత్రలే కాకుండా... ఇలా ఇతరత్రా పాత్రలు చాలానే సృష్టించవచ్చు కానీ, మన దర్శకులు ఆ దిశగా ఆలోచించడం లేదు. కొన్ని ఆంగ్ల సినిమాలు చూస్తున్నప్పుడు మనం చేయడానికి ఇన్ని రకాల పాత్రలు ఉన్నాయా అనిపిస్తుంది.



## నా చిన్నప్పుడే పాన్ ఇండియా స్టార్స్ ఉన్నారు: హీరో తేజ సజ్జా

"మనం ఎంత ఖర్చుపెట్టినా ప్రేక్షకుల నమ్మకాన్ని కొనలేం. సినిమాలు స్పీడ్‌గా చేయాలని, రెండు మూడు సినిమాలు వరుసగా చేసేసి, ప్రేక్షకులను ఒక్కసారి నిరుత్సాహపరిచినా నాకు బాధగా ఉంటుంది. నేను దక్కించుకున్న క్రెడిబిలిటీ, నా కష్టం తాలూకు విలువ పోతుంది. నా సినిమా వస్తోంది... థియేటర్స్‌కు రండి అని ఆడియన్స్‌ని నేను కాన్ఫిడెంట్‌గా, ధైర్యంగా పిలిచేలా నా సినిమాలు ఉండాలనుకుంటాను. 'మిరాయ్' ఇలాంటి చిత్రమే" అని తేజ సజ్జా అన్నారు. తేజ సజ్జా హీరోగా నటించిన చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం తేజ సజ్జా చెప్పిన సంగతులు.

ఫుల్ ఫ్యామిలీ అండ్ క్లీన్ ఫిల్మ్ 'మిరాయ్'. యాక్షన్, అడ్వెంచర్, ఎమోషన్, డివోషన్, ఎలివేషన్... ఇలా అన్ని అంశాలు ఉన్న చిత్రం ఇది. చార్మినార్‌లోని కుర్రాడు వాడి ధర్మం ఏంటో వాడు గ్రహించి, తనకి, యోధ ప్రపంచానికి ఉన్న సంబంధం ఏంటో తెలుసుకుని, ఓ పెద్ద ఆపదను ఆపడానికి ఎంత దూరం వెళ్లాడు? తల్లి ఆశయం కోసం ఏం చేశాడు? ప్రపంచం అంతరించబోతున్నటువంటి ఓ పెద్ద ఆపద రాబోతున్నప్పుడు మన ఇతిహాసాల్లో వేల సంవత్సరాల క్రితం పెట్టి ఉంచిన సమాధానాన్ని ఈ కుర్రాడు ఎలా కనుక్కుంటాడు? అన్నది ఈ సినిమా కథాంశం.

ఈ చిత్రంలో తొమ్మిది యాక్షన్ సీక్వెన్స్‌లు వరకు ఉన్నాయి. వయసులో ఉన్నాను కాబట్టి ఫిజికల్ చాలెంజ్‌లు ఏం అనిపించలేదు. ఈ సీక్వెన్స్‌లు చూసి, ఆడియన్స్ ఎంత థ్రిల్ అవుతారో చూడాలనుకుంటున్నాను. టీజీ విశ్వప్రసాద్‌గారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ఆడియన్స్‌కు నచ్చే మంచి సినిమా తీద్దామనుకునే నిర్మాత. ఆయనలాంటి నిర్మాతలు అరుదు. అందుకే ఆయనతో మరో సినిమా చేస్తున్నాను.

నా చిత్రాలతో ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేయాలని తపన పడుతుంటాను. కొత్తదనంతో కూడిన సినిమాలు చేయాలనుకుంటాను. ఆ ప్రెజర్ ఉంది. కానీ 'హను-మాన్' సినిమా సక్సెస్‌తో నాపై కొత్తగా పెరిగిన ఒత్తిడి ఏం లేదు. చె□పాలంటే ఒక రకంగా 'హను-మాన్' సినిమా విషయంలోనే ఒత్తిడి ఫీలయ్యాను. కొన్ని ఇబ్బందికర పరిస్థితుల మధ్య ఆ సినిమా విడుదలైంది. ఈ సినిమా విజయం సాధించింది కదా అని 'మిరాయ్' సినిమాలో మార్పులు చేర్పులు చేయలేదు. మా నాన్నగారు హార్డ్‌వర్కింగ్ పర్సన్. ఆయన వయసు 65. ఈ రోజుకీ ఆయన ఉదయం 6.30కి ఉద్యోగానికి వెళ్తారు. సాయంత్రం 8 గంటలకు వస్తారు. పనిని ఫస్ట్ ప్లేస్‌లో పెట్టేవారిలో మా ఫాదర్ ఒకరు. అలాంటి ఇంటి నుంచి వస్తున్నాను కాబట్టే పనికి నేను ఇంత ప్రాధాన్యత ఇస్తున్నానేమో అనిపిస్తోంది. పనే దైవం అని భావిస్తాను. కథ కుదరితే పాన్ ఇండియా స్థాయిలో నా సినిమా రిలీజ్ చేస్తాం. నిజానికి పాన్ ఇండియా సూపర్ స్టార్లు నా చిన్నప్పట్నుంచి ఉన్నారు. రామారావు, నాగేశ్వరరావుగార్ల సినిమాలు చెన్నైలో చూసేశారు. చిరంజీవిగారు స్ట్రయిట్‌గా హిందీలో సినిమాలు చేశారు. రజనీకాంత్, కమల్‌హాసన్‌గార్ల సినిమాలు నేను నా చిన్నప్పట్నుంచి చూస్తున్నాను. అలాంటి వారికి జోడించాల్సిన పాన్ ఇండియా స్టార్ ట్యాగ్‌ని నాలాంటి యంగ్ హీరోస్‌కి పెట్టడం ఏ మాత్రం కరెక్ట్ కాదని నమ్మేవారిలో నేనొకడిని. తెలుగు ప్రేక్షకుల అభిరుచి మేరకు మేం సినిమాలు చేస్తున్నాం. ఒకవేళ మేం చేసే చిత్రం ఇతర భాషల ఆడియన్స్‌కు కూడా నచ్చితే, అది మాకు బోనస్. దీని కోసం రిలీజ్ చేయడమే. అంతేకానీ... అక్కడ ఎస్టాబ్లిష్ అవ్వాలన్న ప్రయత్నం ఏమీ లేదు.

'జై హనుమాన్' చిత్రంలో నటిస్తున్నానా? లేదా అనేది ప్రశాంత్ వర్మగారు చెబుతారు. 'జాంబిరెడ్డి 2' సినిమాకు ఇంకా దర్శకుడు ఫిక్స్ కాలేదు. ప్రశాంత్‌గారు కథ అందిస్తున్నారు. విశ్వప్రసాద్‌గారు నిర్మిస్తారు. 'మిరాయ్' సినిమా విజయం సాధిస్తే, రెండో భాగం కూడా ఉంటుంది.





## అమ్మవారికి రూ.4 కోట్ల విలువైన వజ్రాల కిరీటం సమర్పించిన ఇళయరాజా



కర్ణాటకలోని కొల్లూరు మూకాంబిక అమ్మవారికి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా రూ. 4 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన వెండి కిరీటాన్ని బహుకరించారు. తాజాగా అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన ఆయన.. స్వయంగా ఈ కిరీటంతో పాటు వీరభద్ర స్వామికి వెండి ఆయుధాన్ని అందజేశారు. గుడి అర్చకులు దగ్గర ఉండి ఇళయరాజాతో పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలతోపాటు అమ్మవారి ఫొటో అందజేశారు. ఇళయరాజా వెంట ఆయన తనయుడు కార్తిక్, మనవడు యతీశ్ తదితరులు ఉన్నారు. ఇళయరాజాకు దైవభక్తి ఎక్కువే. తరచు ఆయన మూకాంబిక అమ్మవారి దర్శనానికి వెళ్తుంటారు. 2006లో కూడా ఆయన అమ్మవారికి ఓ కిరీటం బహుమతిగా ఇచ్చారు.

కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరుకు సుమారు 130 కిలోమీటర్ల దూరంలో... దట్టమైన అడవుల మధ్యన నెలకొని ఉంది మూకాంబికాలయం. ఆ రాష్ట్రంలోని ఏడు మోక్షపురాల్లో కొల్లూరు మూకాంబిక గుడి ఒకటి. ఆలయం ఉన్నది కర్ణాటక రాష్ట్రంలో అయినా, ఆమెను ఎక్కువగా సందర్శించుకునేది కేరళీయులే కావడం విశేషం.

# చైనా, ఉజ్బెక్ క్లబ్‌లతో ఈస్ట్ బెంగాల్ పోరు



నవంబర్‌లో ఏఎఫ్‌సీ మహిళల చాంపియన్స్ లీగ్

న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ క్లబ్ ఈస్ట్ బెంగాల్ జట్టుకు ఏఎఫ్‌సీ మహిళల చాంపియన్‌షిప్ గ్రూప్ 'బి'లో చోటు దక్కింది. కౌలాలంపూర్‌లో తీసిన 'డ్రా'లో ఈస్ట్ బెంగాల్ మహిళల జట్టుకు ఒక రకంగా ఇది క్లిష్టమైన పోరే! 'బి' గ్రూపులో చైనా, ఇరాన్, ఉజ్బెకిస్తాన్‌లకు చెందిన క్లబ్‌లతో ఈస్ట్ బెంగాల్ తలపడనుంది. ఈ సీజన్ భారత మహిళల లీగ్‌లో విజేతగా నిలువడం ద్వారా ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీ ఏఎఫ్‌సీ మహిళల టోర్నీకి అర్హత సంపాదించింది. తెలంగాణకు చెందిన సౌమ్య గుగులోత్ ఈస్ట్ బెంగాల్‌కు టైటిల్ దక్కడంలో కీలకపాత్ర పోషించింది. వివిధ దేశాలకు చెందిన దేశవాళీ చాంపియన్లు ఈ టోర్నీలో పోటీ పడతాయి. మొత్తం 12 జట్లను మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 'బి'లో చైనాకు చెందిన వుహాన్ జియాంగ్దా, ఇరానీ చాంపియన్ బమ్ ఖటూన్, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన పీఎఫ్‌సీ నసఫ్ మహిళల క్లబ్ జట్లు (డబ్ల్యూ ఎఫ్‌సీ) ఉన్నాయి. జియాంగ్దా ఐదుసార్లు చైనీస్ లీగ్‌లో విజేతగా నిలిచింది. బమ్ ఖటూన్ (ఇరాన్) అయితే ఏఎఫ్‌సీ టోర్నీకి అర్హత సాధించడం ఇది నాలుగోసారి. ఇక ఉజ్బెకిస్తాన్‌లో తిరుగులేని దేశవాళీ జట్టు పీఎఫ్‌సీ నసఫ్. ఈ జట్టు ఏకంగా 16 సార్లు అక్కడ విజేతగా నిలిచింది. ఇలాంటి ఘనాపాటిలతో భారత అమ్మాయిలు ఏ మేరకు తలపడతారో చూడాలి. నవంబర్‌లో జరిగే చాంపియన్స్ లీగ్ మ్యాచ్‌ల్లో ఈ మూడు జట్లతో ఈస్ట్ బెంగాల్ క్లబ్ తలపడుతుంది. ఒక్కో గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. ఈ ఆరు జట్లతో పాటు మూడు గ్రూపుల్లో ఉన్న అత్యుత్తమ మూడో స్థానంలో ఉన్న మరో రెండు జట్లకు నాకౌట్ భాగ్యం దక్కుతుంది. వచ్చే ఏడాది మార్చిలో క్వార్టర్ ఫైనల్ పోటీలు, మే నెలలో సెమీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీ షెడ్యూల్

నవంబర్ 17: ఈస్ట్ బెంగాల్ X బమ్ ఖటూన్ ఎఫ్‌సీ (ఇరాన్ టీమ్)

నవంబర్ 20: ఈస్ట్ బెంగాల్ X వుహాన్ జియాంగ్దా (చైనా టీమ్)

నవంబర్ 23: ఈస్ట్ బెంగాల్ X పీఎఫ్‌సీ నసఫ్ (ఉజ్బెక్ టీమ్)

# రత షూటర్లకు మళ్లీ నిరాశే




నింగ్బో (చైనా): భారత షూటర్ల నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. వరుసగా మూడో రోజు కూడా క్వాలిఫికేషన్ రౌండ్లలోనే గురి కుదరక పతకం బరికి దూరమవుతున్నారు. చైనాలో జరుగుతున్న అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచకప్‌లో గురువారం జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమా మహేశ్ సహా దివ్యాన్□ష, రాహీ సర్నోబత్‌లు క్వాలిఫయింగ్‌లోనే వెనుదిరిగారు.
పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్‌లో దివ్యాన్□ష 630 స్కోరుతో 19వ స్థానంలో నిలిచాడు. ఉమామహేశ్ 627.7 పాయింట్లు స్కోరు చేసి 39 స్థానంలో, మరో భారత మరో షూటర్ నీరజ్ కుమార్ (626.1) 54వ స్థానంలో నిలిచారు. మహిళల ర్యాపిడ్ ఫైర్ క్వాలిఫికేషన్‌లో అభిజ్ఞ అశోక్ పాటిల్ 583 స్కోరుతో 11వ స్థానంలో నిలిచింది. టీఎస్ దివ్య (581), ఒలింపియన్, ఆసియా క్రీడల చాంపియన్ రాహీ సర్నోబత్ (581)లు వరుసగా 16, 17 స్థానాలు పొందారు. ఇప్పుడిక భారత్ ఆశలన్నీ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌పైనే ఉన్నాయి. మెహులీ ఘోష్, తెలంగాణ అమ్మాయి సురభి రాపోలు, మానిని కౌశిక్‌లు బరిలో ఉన్నారు.

# ఉద్యోగానికి 'జై'... క్రికెట్‌కూ 'సై'



ఒమన్ ఆటగాళ్ల క్రికెట్ గాథ

తొలిసారి ఆసియా కప్ టి20 టోర్నీ బరిలోకి

సాక్షి క్రీడా విభాగం : మన దేశంలో క్రికెట్ ఓ మతమైంది. కోట్ల మంది జీవితాల్లో భాగమైంది. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లిల అంత స్థాయికి ఎదగలేకపోయినా సరే ఒక్కసారి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెంట్రల్ కాంట్రాక్టు దక్కితే చాలు... 'గ్రేడ్'తో పని లేకుండా కోట్ల రూపాయల్లో వార్షిక పారితోషికం... పోటీలకు ఇంతని లక్షల్లో మ్యాచ్ ఫీజలు లభిస్తాయి. కాబట్టి ఆటగాడైతే చాలు... దేశవాళీ క్రికెట్‌తోనూ ఆటతోనే విలాసవంతంగా బ్రతికేస్తాడు. అంతెందుకు ఒక్క ఐపీఎల్ సీజన్‌లో జూనియర్ స్థాయి ఆటగాడైన సరే అదృష్టం తలుపుతట్టి వేలంలో ఆయా జట్లకు ఎంపికైనా చాలు మిగతా జీవితమంతా సుఖమయం అవుతుంది. అయితే ఇదంతా భారత్‌లోనే చెల్లుతుంది. కానీ ఇతర దేశాల్లోని క్రికెటర్లు మైదానంలో చెమటోడ్చాలి. ఆఫీస్‌లో ఉద్యోగం చేయాలి.

చాలా దేశాల్లో ఇలానే...

క్రికెట్ ఆడే ఎన్నో దేశాల్లో ఇలాగే ఉంటుంది. కేవలం బ్యాట్ పట్టి నెట్స్‌లో ప్రాక్టీస్ చేసి, మ్యాచ్‌లపుడు మైదానంలో దిగితే సరిపోదు. జీవనాధారం కోసం ఉద్యోగం లేదంటే వ్యాపారం ఏదో ఒకటి తప్పనిసరిగా చేయాల్సిందే! తాజా ఆసియా కప్ టి20 టోర్నీలో బరిలో ఉన్న ఒమన్ క్రికెటర్లు కూడా ఇదే చేస్తారు. రూపాయి మారకం విలువ పరంగా ఒమని రియాల్ (ఒమన్ కరెన్సీ) మనకంటే చాలా విలువైందే అయినా... క్రికెట్‌లో మాత్రం బలహీనమైంది.

అక్కడి ప్రొఫెషనల్ క్రికెటర్లు సైతం తెల్లారితే లంచ్ బాక్స్‌లు కట్టుకొని ఆఫీస్‌కు వెళ్తారు. సాయంత్రమైతేనే ఆటకు సిద్ధమవుతారు. మ్యాచ్‌లు, పెద్ద పెద్ద సిరీస్‌లు ఉంటేనే పక్షం లేదంటే నెలకు మించి సెలవులు పెట్టి మెగా ఈవెంట్లు ఆడతారు. ఇది ముగియగానే ఒమన్ ఆటగాళ్లు మళ్లీ ఆఫీస్ వ్యవహారాలు చూసుకుంటారు. ఇవి ఎవరో 'నెట్టింట' పెట్టిన విషయాలో, 'షార్ట్స్', 'రీల్స్'లో చెప్పిన కబుర్లో కాదు... స్వయంగా ఒమన్ కెప్టెన్ జతిందర్ సింగ్, ఆల్‌రౌండర్ సుఫియాన్ మెహమూద్ వెల్లడించిన వాస్తవాలు.

ఉద్యోగానికే తొలి ప్రాధాన్యం

క్రికెటే తమ కెరీర్ కానేకాదని జతిందర్ స్పష్టం చేశాడు. తమ తొలి ప్రాధాన్యం ఉద్యోగమేనన్నాడు. ఆటను మొదలు పెట్టిన తొలినాళ్లలో మా ప్రాధాన్యమంతా ఉద్యోగానికే ఉండేదని, క్రికెట్ ఆట తమకు రెండో ప్రాధాన్యమని ఒమన్ కెప్టెన్ చెప్పాడు. 'నేనే కాదు చాలామంది ఇదే చేస్తారు. ఠంచనుగా ఉద్యోగం చేసేందుకు బయల్దేరతారు. క్రికెట్‌ను ఓ ప్రత్యామ్నాయంగానే చూస్తారు. అయితే ఇప్పుడు ఆసియా కప్ లాంటి పేరొందిన సిరీస్ ఆడటం ద్వారా క్రికెట్ కల పెద్దగా అనిపిస్తుంది. తొలిసారి ఈ టోర్నీ ఆడేందుకు ఆటగాళ్లంతా చాలా ఉత్సాహంగా ఉన్నారు' అని జతిందర్ అన్నాడు.

కాంక్రిట్‌పై కష్టాలెన్నో...

ఒమన్‌లో క్రికెట్‌కు ప్రత్యేకించి టర్ఫ్ గ్రౌండ్లు అంటూ లేని రోజుల్లో తాము సిమెంట్ వికెట్‌లపైనే ఆడాల్సి వచ్చిందని, 2008లో ఆస్ట్రో టర్ఫ్ వినియోగంలోకి వచ్చినా... మూడేళ్ల తర్వాతే 2011 నుంచి పూర్తిస్థాయి టర్ఫ్ గ్రౌండ్‌పై క్రమం తప్పకుండా ఆడుతున్నామని జతిందర్ ఒమన్ క్రికెట్ కష్టాలను చెప్పుకొచ్చాడు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ఫలితం (ప్రాభవం లేని క్రికెట్)లేని ఆట కోసం ఎందుకు కష్టపడాలని ఎన్నోసార్లు అనిపించినా... ఏదో క్రికెట్‌పై ఉన్న కాస్త మక్కువే ఇక్కడిదాకా తీసుకొచ్చిందని వివరించాడు. 36 ఏళ్ల జతిందర్ ఇప్పటి వరకు 36 వన్డేలాడి 1704 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలున్నాయి. అంతర్జాతీయ టి20ల్లో 115 స్ట్రయిక్‌రేట్‌తో 1120 పరుగులు సాధించాడు. మరోవైపు 34 ఏళ్ల ఆల్‌రౌండర్ సుఫియాన్ 8 వన్డేలాడి 107 పరుగులు చేయడంతో పాటు 24.50 సగటుతో 6 వికెట్లు కూడా తీశాడు. తనకు టీమిండియాలో గిల్, సూర్యకుమార్, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్, తిలక్ వర్మ అంటే ఇష్టమని చెప్పాడు.

క్రికెటెందుకు... చదువుకో ముందు!

సుఫియాన్ ఒమన్ క్రికెట్ జట్టుకు ఎంపికవగానే అతని తల్లిదండ్రులు ససేమిరా అన్నారట! ఒమన్‌లో క్రికెట్‌కు భవిష్యత్తే లేదని, ఉన్నత చదువులు చదివి ఉన్నతోద్యోగంపైనే దృష్టి సారించాలని తన తల్లిదండ్రులు గట్టిగా చెప్పారని పేర్కొన్నాడు. 'కానీ క్రికెట్ అంటే పిచ్చి. నాపై ఉన్న నమ్మకమే ఆటవైపు నడిపించింది. 2016 టి20 ప్రపంచకప్ అర్హత సాధించగానే మేం పడిన కష్టాలకు సాంత్వన చేకూరింది' అని సుఫియాన్ తెలిపాడు. ఒమన్ క్రికెట్ నిలబడటానికి ఆ మెగా ఈవెంట్ ఎంతగానో దోహదం చేసిందన్నాడు. భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన అభిమాన క్రికెటర్ అని చెప్పుకొచ్చాడు.

# ముంబా పాయింట్ తేడాతో..



విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రొ కబడ్డీ సీజన్ 12లో యు ముంబా ఉత్కంఠభరిత విజయాన్ని అందుకుంది. గురువారం ఆ జట్టు 4039తో పట్నా పైరేట్స్‌ను ఓడించింది. ఆఖరి వరకు ఏ జట్టు గెలుస్తుందో అనే ఉత్కంఠ రేగినా.. ఒత్తిడిని జయిస్తూ ముంబా గెలిచింది. ఈ పోరు ఆరంభంలో ముంబా దూకుడుగా ఆడింది. విరామ సమయానికి 23 15తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధంలో తొలి పది నిమిషాలు పట్నా అటాకింగ్ చేసింది. ప్రత్యర్థిని ఆలౌట్ చేసి పాయింట్ల అంతరాన్ని కరిగించింది. ఒక దశలో 2929తో స్కోరు సమమైంది. ఆఖరిదాకా రెండు జట్లు పట్టు వీడకపోవడంతో మ్యాచ్ టై అవుతుందేమో అనిపించింది. కానీ ఒక్క పాయింట్ తేడాతో ముంబా విజయాన్ని సొంతం చేసుకుంది. పీకేఎల్ చరిత్రలో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 20పైన పాయింట్లు సాధించిన తొలి రైడర్‌గా అయాన్ (21) ఘనత సాధించాడు. ముంబా తరపున అమీర్ (12), అనిల్ (9) రాణించారు. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 3828తో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. అషు మలిక్ (14) ఢిల్లీని గెలిపించాడు. గురువారంతో విశాఖ అంచె పోటీలు ముగిశాయి. ఇక పీకేఎల్ జైపూర్‌నకు తరలనుంది. ప్రస్తుతం దబంగ్ ఢిల్లీ (5 మ్యాచ్‌ల్లో 5 విజయాలు) అగ్రస్థానంలో ఉంది. తెలుగు టైటాన్స్ (5 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 2 ఓటములు) నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

# పూజా రాణికి పతకం ఖాయం



లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత్‌కు మూడో పతకం ఖాయమైంది. ఇప్పటికే నుపుర్ షెరాన్ (ప్లస్ 80 కేజీలు), జైస్మిన్ లంబోరియా (57 కేజీలు) సెమీఫైనల్‌కు చేరి కనీసం కాంస్య పతకాలు ఖాయం చేసుకోగా... 80 కేజీల విభాగంలో పూజా రాణి కూడా సెమీస్‌లో అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో 'బై' దక్కించుకున్న 34 ఏళ్ల పూజ క్వార్టర్ ఫైనల్లో 3:2 తేడాతో ఎమిలియా కొటెరస్కా (పోలాండ్)పై విజయం సాధించింది.

సెమీఫైనల్లో ఎమిలీ అస్క్విత్ (స్విట్జర్లాండ్)తో పూజ తలపడనుంది. పురుషుల 65 కేజీల విభాగంలో అభినాశ్ జమ్వాల్ 1:4తో ఒలింపిక్ కాంస్య పతక విజేత లాషా గురులి (జార్జియా) చేతిలో ఓడాడు. ఇక భారత్ నుంచి జాదుమణి సింగ్ (48 కేజీలు), మీనాక్షి (48 కేజీలు) మాత్రమే పోటీలో ఉన్నారు. తాష్కెంట్‌లో జరిగిన గత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి దీపక్ భోరియా (51 కేజీలు), హుసాముద్దీన్ (57 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) కాంస్యాలు

# బంగ్లాదేశ్ శుభారంభం

హాంకాంగ్‌పై 7 వికెట్లతో విజయం

నేడు ఒమన్‌తో పాకిస్తాన్ 'ఢీ'

రాత్రి గం. 8 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో...

అబుదాబి: ఆసియా కప్ టి20 టోర్నీని బంగ్లాదేశ్ సునాయాస విజయంతో మొదలుపెట్టింది. గ్రూప్ 'బి'లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన బంగ్లా 7 వికెట్ల తేడాతో హాంకాంగ్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. అనంతరం బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 144 పరుగులు సాధించి గెలిచింది. తమ తొలి పోరులో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిన హాంకాంగ్‌కు ఇది వరుసగా రెండో పరాజయం. ఓపెనర్ అన్షుమన్ రథ్ (4) తొందరగానే వెనుదిరిగినా... మరో ఓపెనర్ జీషాన్ అలీ (34 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) చక్కటి షాట్లతో హాంకాంగ్‌కు తగిన ఆరంభాన్ని అందించాడు. సీనియర్ బ్యాటర్ బాబర్ హయత్ (14) విఫలం కాగా, నిజాకత్ ఖాన్ (40 బంతుల్లో 42; 2 ఫోర్లు, 1 సిక్స్) పట్టుదలగా క్రీజ్‌లో నిలిచి పరుగులు సాధించాడు. ఈ క్రమంలో తాను ఆడిన 32వ బంతికి గానీ అతను తన తొలి బౌండరీ కొట్టలేకపోయాడు!

చివర్లో కెప్టెన్ యాసిమ్ ముర్తజా (19 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడు హాంకాంగ్‌కు చెప్పుకోదగ్గ స్కోరును అందించింది. బంగ్లా బౌలర్లు ప్రత్యర్థిని కట్టడి చేయడంలో సఫలమయ్యారు. ముఖ్యంగా 3-13 మధ్య ఆడిన 11 ఓవర్లలో ఒక్క ఓవర్లో మాత్రమే హాంకాంగ్ రెండంకెల స్కోరు చేయగలిగింది. అయితే ఆఖరి 6 ఓవర్లలో 54 పరుగులు రాబట్టడంతో హాంకాంగ్ గౌరవప్రదంగా ముగించగలిగింది.

తన్‌జీమ్, తస్కీన్, రిషాద్ తలా 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఓపెనర్లు పర్వేజ్ (19), తన్‌జీద్ (14) ఎక్కువ సేపు నిలబడకపోయినా... కెప్టెన్ లిటన్ దాస్ (39 బంతుల్లో 59; 6 ఫోర్లు, 1 సిక్స్), తౌహీద్ (36 బంతుల్లో 35 నాటౌట్; 1 ఫోర్) భాగస్వామ్యంతో బంగ్లా సునాయాస విజయాన్ని అందుకుంది. వీరిద్దరు మూడో వికెట్‌కు 70 బంతుల్లో 95 పరుగులు జోడించారు. నేడు దుబాయ్‌లో జరిగే మ్యాచ్‌లో ఒమన్ జట్టుతో పాకిస్తాన్ ఆడుతుంది.




# మళ్లీ ఓడిన గుకేశ్

సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌కు వరుసగా మూడో పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన ఏడో రౌండ్‌లో గుకేశ్ 52 ఎత్తుల్లో ఇదిజ్ గురెల్ (టర్కీ) చేతిలో ఓడిపోయాడు. ఐదో రౌండ్‌లో అభిమన్యు మిశ్రా (అమెరికా) చేతిలో, ఆరో రౌండ్‌లో నికోలస్ (గ్రీస్) చేతిలో ఓడిన గుకేశ్ ... ఏడో రౌండ్ తర్వాత మూడు పాయింట్లతో 84వ స్థానంలో ఉన్నాడు.

మరోవైపు తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి పరాజయాన్ని చవిచూశాడు. మథియాస్ బ్లూబామ్ (జర్మనీ)తో జరిగిన గేమ్‌లో అర్జున్ 51 ఎత్తుల్లో ఓడిపోయాడు. ఓపెన్ విభాగంలో పోటీపడుతున్న భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ రెండో విజయం అందుకుంది. ఇవిచ్ వెల్మిర్ (సెర్బియా)తో జరిగిన గేమ్‌లో దివ్య 49 ఎత్తుల్లో గెలిచింది.

